# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 142 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శనివారం 12 జులై 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 142 12-07-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## గవర్నర్ నజీర్‌తో సీఎం చంద్రబాబు భేటీ



**అమరావతి జులై 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు శుక్రవారం భేటీ అయ్యారు. ఏపీలో శాంతి భద్రతలు, ఇతర అంశాలపై ఇరువురు చర్చించారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం గురించి చంద్రబాబు గవర్నర్‌కు వివరించారు. కాగా ఏపీ మంత్రి వర్గంలో మార్పులు ఉంటాయన్న ఊహాగానాలు, త్వరలోనే సీఎం ఢిల్లీ పర్యటన దృష్ట్యా గవర్నర్‌తో భేటీ అవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.

### పన్ను ఎగవేతలను అడ్డుకోవడానికి
## టెక్నాలజీ ఉపయోగించండి..

**సీఎం చంద్రబాబు**

**అమరావతిలో కేంద్ర, రాష్ట్ర జీఎస్టీ అధికారుల సమన్వయ సమావేశం**

**దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు**

**జీఎస్టీ వసూళ్లలో దేశానికి ఏపీ రోల్ మోడల్ లా ఉండాలని ఆకాంక్ష**

**అమరావతి జులై 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఏపీ సీఎం చంద్రబాబు నేడు కేంద్ర, రాష్ట్ర జీఎస్టీ అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పన్ను ఎగవేతలను అడ్డుకోవడానికి టెక్నాలజీని వినియోగించుకోవాలని సూచించారు. అందుకోసం డేటా అనలిటిక్స్ సాయం తీసుకోవాలని అన్నారు.

**చంద్రబాబు అధికారులకు చేసిన సూచనలు...**

- సమర్థవంతమైన పన్ను వసూళ్ల విధానం ద్వారా జాతీయ సంపదను పెంచాలి. ఆ సంపదను ప్రజా సంక్షేమం, అభివృద్ధికి వినియోగించాలి
- జీఎస్టీ వసూళ్లలో ఏపీ దేశానికే రోల్ మోడల్ లా ఉండాలి
- జీఎస్టీకి సంబంధించి పొరుగు రాష్ట్రాలతో పోటీ పడేలా యాక్షన్ ప్లాన్ ఉండాలి
- జీఎస్టీ రియలైజేషన్ కోసం కేంద్ర, రాష్ట్ర అధికారుల మధ్య సమాచార సమన్వయం ఉండాలి
- ఎగవేతలను గుర్తించేందుకు విద్యుత్ వినియోగం తదితర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి
- ఏపీలో ఎక్కడా పన్ను ఎగవేతలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలి
- జీఎస్టీ రిజిస్ట్రేషన్లలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలి






## గోదావరికి భారీగా.. వరద నీరు

**గోదావరికి పెరుగుతున్న వరద ప్రవాహం అలర్ట్ జారీ చేసిన ఏపీఎస్‌డీఎంఏ**

**రాజమహేంద్రవరం జులై 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో గోదావరి నదిలో వరద ప్రవాహం పెరుగుతోంది. ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ శుక్రవారం స్పష్టం చేశారు. నదీ పరివాహక గ్రామాలు, లంక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 37.2 అడుగులకు చేరిందని వెల్లడించింది. ఇదే సమయంలో ధవళేశ్వరం వద్ద

- తరువాయి 2లో..





### సెప్టెంబర్ 24 నుండి తిరుమలేశుని
## వార్షిక బ్రహ్మోత్సవాలు

**తిరుమల జులై 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు.. ఏడుకొండల వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది సెప్టెంబర్ 24వతేదీ నుండి అక్టోబర్ 2వరకు జరిపించేలా తిరుమల తిరుపతి దేవస్థానం ముహర్తం ఖరారుచేసింది. తొమ్మిది రోజులపాటు నిర్వహించనున్న దేవదేవుని వాహన సేవలు ఉదయం 8గంటలకు, రాత్రి 7గంటలకు మొదలవుతాయి. అన్ని ప్రత్యేక దర్శనాలు, విఐపి బ్రేక్ దర్శనాలు, దాతల దర్శనాలు కూడా రద్దుచేశారు. బ్రహ్మోత్సవాలకు దేశవిదేశాల నుండి తరలివచ్చే అశేషసంఖ్య భక్తులకు అసౌకర్యం కలగకుండా మాఢవీధుల్లో గ్యాలరీలకు చేరుకునేలా, వాహనాలకు పార్కింగ్ సదుపాయాలు తెలిపే రోడ్డుమ్యాప్ పక్కాగా ఉండేలా చూస్తున్నారు.

**బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షా సమావేశం**

ఈ ఏడాది వేంకటేశ్వరస్వామి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన చేపట్టాల్సిన ఏర్పాట్లు, సౌకర్యాలు, ప్రణాళికాబద్ధంగా తీసుకోవాల్సిన భద్రత చర్యలపై తిరుమల అన్నమయ్య భవనంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అన్ని విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు సెప్టెంబర్ 16వతేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం తొలి ఘట్టంగా, 23వతేదీ శాస్త్రోక్తంగా అంకురార్పణ జరుగుతుంది. సెప్టెంబర్ 24వతేదీ సాయంత్రం ధ్వజా రోహణం, రాత్రి పెద్దశేషవాహనం, ఐదవరోజు

- తరువాయి 2లో..





## భాషల పేరిట.. అడ్డుగోడలొద్దు

- హిందీ నేర్చుకుంటూనే మాతృభాషతో పయనిద్దాం
- భాష నేర్చుకోవడానికి ఆటంకాలు దేనికి
- మరో భాషను అంగీకరించడం ఓటమి కాదు
- రాజ్యభాష స్వర్ణోత్సవాల్లో ఉపముఖ్యమంత్రి పవన్

**అమరావతి జులై 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఐటీ రంగంలో విజయం సాధించడానికి ఆంగ్లం ఎంత ముఖ్యమో, దేశంలో ఎక్కువ మంది మాట్లాడే హిందీ నేర్చుకోవడం వల్ల కూడా అంతే ప్రయోజనం ఉంటుందని ఉపముఖ్యమంత్రి

- తరువాయి 2లో..



## ట్రంప్ కొత్త బిల్లు ఎఫెక్ట్..

- భారతీయ విద్యార్థులకు, టూరిస్టులకు అమెరికా షాక్!
- నాన్ ఇమ్మిగ్రేషన్ వీసాల ఫీజును పెంచిన ట్రంప్ ప్రభుత్వం
- రూ. 16 వేల నుండి రూ. 40 వేలకు పెరిగిన టూరిస్ట్ వీసా ఫీజు
- యూఎస్ వీసా ఇంటిగ్రిటీ ఫీజు కింద 250 అమెరికన్ డాలర్లు చెల్లించాలి

అమెరికా వెళ్లాలనుకునే వారికి డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం షాకిచ్చింది. వన్ బిగ్ బ్యూటిఫుల్

- మిగతా 2లో..

### ఇప్పుడు జనాభానే..
## గొప్ప ఆస్తి..


- ఎందరు పిల్లలుంటే అంత సంతోషమని ఆ సినిమాలో చూపించారు: సీఎం చంద్రబాబు
- ప్రపంచ జనాభా దినోత్సవంపై అమరావతిలో సమ్మిట్
- హాజరైన సీఎం చంద్రబాబు
- జనాభా పెరగాలని పిలుపు

**అమరావతి జులై 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

దేశానికి బలమైన ఆర్థికవనరు జనాభేనని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. జనాభా పెరుగుదలకు త్వరలో మంచి పాలసీ తీసుకొస్తామని అన్నారు. దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని చెప్పిన గురజాడ అప్పారావు

- తరువాయి 2లో..





## జన జాగృతి రైల్ రోకో వాయిదా

**ప్రకటించిన కవిత**

**హైదరాబాద్ జులై 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

హైదరాబాద్ - బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఆర్డినెన్స్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటన చేసిన నేపథ్యంలో ఈ నెల 17వ తేదీన తాము నిర్వహించతలపెట్టిన రైల్ రోకోను నిరవధిక వాయిదా వేస్తున్నట్లు జన జాగృతి వ్యవస్థాకురాలు, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రకటించారు.. హైదరాబాద్ లో నేడు ఆమె మీడియాతో మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్డినెన్స్ ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం బీసీ బిడ్డలు, తెలంగాణ జాగృతి, యునైటెడ్ ఫూలే ఫ్రంట్ విజయం అని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చే ఆర్డినెన్స్ ను ఆమోదించకుండా గవర్నర్ ఆపితే మళ్లీ రైల్ రోకో తప్పదని హెచ్చరించారు. బీజేపేతర పాలిత రాష్ట్రాల్లో గవర్నమెంట్ కు గవర్నర్లకు మధ్య పంచాయితీలు నడుస్తున్నాయి. ప్రభుత్వాలు ఆర్డినెన్సులు, బిల్లులు పంపితే సంతకాలు పెట్టకుండా గవర్నర్లు ఆపుతున్నారు. తెలంగాణలో అదే పరిస్థితి వస్తే మాకు ఉద్యమాలు కొత్తకాదని మళ్లీ ఉద్యమం చేస్తామని రైళ్లు, బస్సులను స్తంభింపచేస్తామన్నారు.

### రంగరాయ మెడికల్ కళాశాలలో
# కీచకపర్వం

**రంగరాయ మెడికల్ కళాశాలలో లైంగిక వేధింపులు**

**ఘటనపై సిఎం చంద్రబాబు ఆదేశం**

**కాకినాడ జులై 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాలలో విద్యార్థినులపై కొందరు సిబ్బంది లైంగిక వేధింపులకు పాల్పడుతున్న విషయం వెలుగులోకి వచ్చి కలకలం రేపింది. బీఎస్సీ , డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ




కోర్సులు చదువుతున్న విద్యార్థినులపై ల్యాబ్ సహాయకుడు, మరో ఉద్యోగి లైంగికంగా వేధిస్తున్నారని బాధిత విద్యార్థినులు కొందరు ఫ్యాకల్టీ వద్ద చెప్పుకుని విలపించారు. ఇదే విషయమై ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు అందడంతో




ఆయన తీవ్రంగా పరిగణించి అంతర్గత కమిటీ ద్వారా విచారణ చేయించారు. మైక్రో బయాలజీ, పాథాలజీ, బయో కెమిస్ట్రీ విభాగాల్లో కొందరు సిబ్బంది తమ పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్టు 50 మంది విద్యార్థినులు కమిటీ ముందు చెప్పారు. ఈ కమిటీనివేదిక సమర్పించాల్సి ఉంది. విద్యార్థినులపై లైంగిక

- తరువాయి 2లో..



### మెగా పీటీఎం 2.0
## గ్రాండ్ సక్సెస్ అయింది

**మంత్రి నారా లోకేశ్**

**ఏపీ వ్యాప్తంగా నిన్న మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 2.0**

**అందరికీ కృతజ్ఞతలు తెలిపిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్**

**ఇలాంటి కార్యక్రమాలో విద్యార్థుల భవితకు బంగారు బాట వేయొచ్చని వెల్లడి**

**అమరావతి జులై 11 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన 'మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (పీటీఎం) 2.0' కార్యక్రమం విజయవంతం అయిందని చెబుతూ రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, దాతలు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని ఆయన అన్నారు. సమాజం స్వచ్ఛందంగా అందించిన మద్దతు విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని మంత్రి లోకేశ్

- తరువాయి 2లో..

జనరల్ న్యూస్
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

## పెరుగుతున్న జనాభా.. తగ్గుతున్న వనరులు

జనాభాకు, పర్యావరణానికి ప్రత్యేక సంబంధం ఉన్నది. విశ్వంలో మూడొంతులు నీరు ఉంటే ఒక వంతు భూమి ఉంది. జనాభా ఇంతై.. ఇంతింతై... అన్నట్లుగా పెరిగిపోతే జగమంతా జనమయమైతే ఏం జరుగుతుం ది? భూమాత భారం ఎంతని మోస్తుంది? పర్యావరణ, వాతావరణ, వనరుల స్థితిగతులు ఏమవుతాయి? ప్రజల జీవన ప్రమాణాల పయనం ఎలాగుంటుంది? అంతా అగమ్యగో చరం. ప్రమాదకరం. ఈ ప్రశ్నలకు సమాధా నాలు కావాలి. అధిక జనాభా వల్ల కలిగే దుష్ఫలితాల నివారణ పథకాలు, దిద్దుబాటు చర్యలు, కట్టుబాట్లను కనుగొనాలి.

ఆధునిక కాలంలో మానవ వనరులకు చాలా ప్రాధాన్యత పెరిగింది. పెరుగుతున్న జనాభా కు అనుగుణంగా వనరులు పెరగడం లేదు. ముఖ్యంగా సహజ వనరులు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. 1987 'జులై 11' న ప్రపంచ జనాభా ఐదు బిలియన్లకు చేరుకుంది. ఆ రోజును 'ప్రపంచ జనాభా దినం' గా ఐక్యరాజ్యసమితి గుర్తించింది. ఇక 1989 నుండి క్రమం తప్పకుండా ప్రతి ఏడాది జులై 11వ తేదీన ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. నానాటికీ పెరుగుతున్న జనాభా.. తద్వారా తలెత్తే దుష్పరిణామాలను ప్రజలకు వివరించేందుకు, వారికి ఆయా సమస్యలపై అవగాహన కలిగించడమే 'ప్రపంచ జనాభా దినోత్సవ' ఆశయం. 2008 జూన్ 28 నాటికి ప్రపంచ జనాభా 6.7 బిలియన్ల వద్ద ఉండగా, 2012 నాటికి ఏడు బిలియన్లను చేరుకుందని ఐరాస తెలిపింది. మరో యాభై ఏళ్లలో ప్రపంచ జనాభా 9 బిలియన్లను చేరే అవకాశముందని కూడా సమితి పేర్కొంది.

కాగా.. అమెరికా 304 మిలియన్ల మంది జనాభాతో మూడో స్థానంలో ఉండగా%ౌ% భారత్, చైనాలు మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. పెరుగుతున్న జనాభాలో అభివృద్ధి చెందుతున్న దేశాలు కీలక పాత్ర పోషిస్తున్నట్టు ఈ సందర్భంగా సమితి అభిప్రాయపడింది. భారత్, అమెరికా, చైనా, బంగ్లాదేశ్, పాకిస్థాన్ తదితర తొమ్మిది దేశాలు వచ్చే 2050 నాటికి ప్రపంచ జనాభాలో సగం శాతాన్ని ఆక్రమిస్తాయని సమితి తెలిపింది. భూమండలంలో మానవజాతి అతి వేగంగా పెరిగిపోతున్న నేపథ్యంలో జనాభా నియంత్రణ, స్థిరీకరణ లాంటి అనేక విషయాలపై జనంలో అవగాహన పెంచడం, చైతన్యం తీసుకురావడం ఈ ఉత్సవ ముఖ్యోద్దేశం. జగత్తులోని జీవరాసులలోకెల్లా మానవజాతి అత్యంత తెలివైనది.

మానవుడు తను జీవించడానికి ప్రకృతి సిద్ధమైన వనరులను, భూ, జల సంపదను వాడినంతగా ఈ జగత్తులో మరే ప్రాణి వాడదు. అంతేకాదు. మానవజాతి తన మనుగడ కోసం, అవసరాల కోసం, విలాసాల కోసం ఇతర ప్రాణులను కూడా సహజ వనరులతోపాటు సమూహంగా నాశనం చేయగలదు. మానవుడు తన అవసరాలు, విలాసాల కోసం అద్భుతాలను సృష్టిస్తున్నాడు. ఈ పరివర్తన వెనుక ప్రకృతి వనరుల నిర్మూలనలు, పశు, పక్ష, వృక్ష జాతి వినాశనలు, బలి దానాలు దాగి ఉన్నాయి అన్న నగ్నసత్యాన్ని విస్మరించకూడదు. జనాభాకు, పర్యావరణానికి ప్రత్యేక సంబంధం ఉన్నది. విశ్వంలో మూడొంతులు నీరు ఉంటే ఒక వంతు భూమి ఉంది.

జనాభా ఇంతై.. ఇంతింతై.. అన్నట్లుగా పెరిగిపోతే జగమంతా జనమయమైతే ఏం జరుగుతుంది? భూమాత భారం ఎంతని మోస్తుంది? పర్యావరణ, వాతావరణ, వనరుల స్థితిగతులు ఏమవుతాయి? ప్రజల జీవన ప్రమాణాల పయనం ఎలాగుంటుంది? అంతా అగమ్యగోచరం. ప్రమాదకరం. ఈ ప్రశ్నలకు సమాధానాలు కావాలి. అధిక జనాభా వల్ల కలిగే దుష్ఫలితాల నివారణ పథకాలు, దిద్దుబాటు చర్యలు, కట్టుబాట్లను కనుగొనాలి. ఈ ఆలోచనలు ప్రపంచ గణాంక శాస్త్రవేత్తలను, జనాభా నియంత్రణ నిపుణులను సుమారు అర్ధశతాబ్దం క్రితమే జాగరూకల్ని చేసాయి. అప్పటి నుంచి ప్రపంచ జనాభాను కట్టుదిట్టం చేయాలని, తద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచాలని ప్రపంచ దేశాలలో చర్యలు మొదలైనాయి.

హద్దూ, అదుపు లేకుండా పెరిగే ప్రపంచ జనాభాను పరిశీలిస్తే ఎంతటి ప్రమాద స్థాయికి చేరుకుందో బోధపడుతుంది. తాజా గణాంకాల ప్రకారం ప్రపంచ జనాభా గడియారం ప్రకారం ప్రతి సెకనుకూ ఐదుగురు పుడుతున్నారు. ఇద్దరు చనిపోతున్నారు. అంటే ప్రపంచంలో భూమి మీద ప్రస్తుతం ఒక సెకెండుకు సగటున ముగ్గురు పెరుగుతున్నారన్నమాట. ఇంకా లోతుగా పరికిస్తే నిమిషయానికి 180 మంది, గంటకు 10,800 మంది, రోజుకు 2,59,200 మంది ప్రతి ఏడాదికి 9,46,08,000 పెరిగిపోతున్నారు. మరో పక్క భూ సంపద క్షీణిస్తున్నది. 2011 మార్చి 1వ తేదీ నాటికి మన దేశ జనాభా 121,01,99,422. అందులో పురుషులు సుమారు 62 కోట్లు కాగా, స్త్రీలు సుమారు 58 కోట్ల పైచిలుకు మాటే. ఇంకో వాస్తవం గత పదేళ్ళకాలంలో మన దేశ జనాభా 18.1 కోట్లు పెరిగింది. మన దేశ జనాభా అమెరికా, ఇండోనేషియా, బ్రెజిల్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, జపాన్ దేశాల మొత్తం జనాభాతో సమానం. మన దేశం జనాభా పెరుగుదల ఇదే రీతిలో కొనసాగితే 2025 నాటికల్లా అధికారింకంగా భారత్ చైనాను అధిగమించి ప్రపంచంలోనే అత్యధిక జనాభాగల దేశంగా ఆవిర్భవించడం తథ్యం అని అమెరికా గణన సంస్థ వెల్లడించింది. సత్వరమే భారత్ దిద్దుబాటు చర్యలు, జనస్థిరీకరణ, నియంత్రణకు పూనుకోవాలి లేదా ఆఫ్రికా దేశాల మాదిరి ఆకలి, దారిద్ర్యం, కరువు రక్కసులు పడగలిప్పడం అనివార్యం అనడంలో మరో మాట లేదు. 2024లో ప్రపంచ జనాభా 8.1 బిలియన్లుగా వుంది.

ప్రపంచంలోనే కుటుంబ నియంత్రణ పథకాలను అధికారికంగా ప్రవేశపెట్టిన దేశం మన దేశమే. 1950లోనే కుటుంబ నియంత్రణ కోసం నూతన సూత్రీకరణాలను చేసి లక్షలు, కోట్లు ఖర్చు చేసింది. అయినా ఆశించిన ఫలితాలు సాధించలేకపోయాం. కారణాలు అనేకం కావచ్చును. ముఖ్యమైనవిగా పేర్కొనాల్సినవి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రాకపోవడం. ప్రభుత్వ పథకాలలో అవకతవకలు, పారదర్శకత లోపించడం, మూఢ నమ్మకాలు, అవిద్య, స్త్రీ సాధికారిత లేకపోవడం. ఇదే విషయంలో 1976లో భారత్‌లో (పాపులేషన్ కంట్రోల్ పాలసీ) జనాభా నియంత్రణ పథకాన్ని అమలులోకి తెచ్చారు. దీనివల్ల జనాభాను మన ఆర్థిక రంగానికి అనుగుణంగా అన్ని కోణాలలో తీర్చిదిద్దడం. ఆర్థిక పరిస్థితిని మెరుగు పర్చడం, జన జీవన శైలిని, ప్రమాణాలను వృద్ధి పర్చడం జరిగింది. ఈ భూమీద వందకోట్ల మందికి పౌష్టికాహారం దొరకడం లేదు. 40 కోట్ల మందికి ఆహారం దొరకడం లేదు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని అధిక జనాభాగల దేశాలు తక్షణమే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలు మూఢ నమ్మకాలను వీడి కులాలకు, మతాలకు అతీతంగా కుటుంబ నియంత్రణ పథకాలను ఆచరించాలి. 'ఒక బిడ్డ ముద్దు రెండోది వద్దు' అన్న నినాదం అక్షర సత్యాన్ని చేయాలి. స్త్రీ సాధికారిత పెంచాలి. స్త్రీ విద్యను పోషించాలి. స్త్రీ విద్యావంతురాలైతే సమాజం ఉన్నతస్థాయికి చేరడం ఖాయం. ముఖ్యంగా యువతరం నడుం కట్టాలి. జనాభాను అదుపుచేసి విద్యా వ్యాప్తి చేసి ప్రతి ఒక్కరూ మానవ బాంబుగా కాక మానవ వనరుగా మారిన రోజున దేశాభ్యుదయానికి వందకోట్ల మార్గాలున్నాయి అనడంలో అతిశయోక్తి ఏ మాత్రమూ లేదు. 2025లో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని మనం జరుపుకుంటున్నప్పుడు, ప్రతి వ్యక్తికీ ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండే, హక్కులు గౌరవించబడే, స్థిరమైన అభివృద్ధి సాధించబడే ప్రపంచాన్ని మనం ఊహించుకుంచుకోవాలి.

ఈ దిశగా పాలకులు కృషి చేయాలి. జనస్థిరీకరణ, నియంత్రణ, ప్రస్తుత ఆర్థిక రంగానికి అనుసంధానం చేస్తే జన జీవనజ్యోతి దేదీపమాన్యంగా వెలుగుతుంది. భూమాత భారం తగ్గుతుంది. కరోనా కారణంగా 2021లో చేపట్ట వలసిన జనాభా లెక్కల నిర్వహణ జరగలేదు. అందువల్ల ప్రస్తుత దేశ జనాభా వివరాలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేవు. వనరులను పెంచుకోకపోతే పెరుగుతున్న జనాభాకు, సహజ వనరులకు మధ్య సమతుల్యత దెబ్బతింటుంది. కొన్ని దేశాల్లో జనాభా పెరుగుతుండగా, మరికొన్ని దేశాల్లో జనాభా తగ్గుతుంది. జనాభా పెరుగుతున్న ఆఫ్రికా దేశాలు పేదరికం, నిరుద్యోగం వంటి సమస్యలతో సతమతమవుతున్నాయి. కుటుంబ నియంత్రణ పాటించడం, స్త్రీ విద్యకు ప్రోత్సా హం, సహజ వనరులని కాపాడు కోవడం వంటి ద్వారా పెరుదలకు కొన్ని పరిష్కార మార్గాలు చూపవచ్చు.

## సెప్టెంబర్ 24 నుండి తిరుమలేశుని వార్షిక బ్రహ్మోత్సవాలు

సెప్టెంబర్ 28వతేదీ రాత్రి గరుడసేవ, అక్టోబర్ 1వతేదీ రథోత్సవం, 2వతేదీ చక్రస్నాన మహోత్సవం ముఖ్యమైన ఘట్టాలు.

**బ్రేక్ దర్శనాలకు తాత్కాలికంగా విరామం**

బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిదిరోజులు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రోటోకాల్ ప్రముఖులకు మినహాయించి మిగిలిన విఐపి బ్రేక్ దర్శనాలు పూర్తిగా రద్దుచేశారు. వృద్ధులు, దివ్యాంగులు, ఎన్‌ఆర్ఐ భక్తులు, దాతల చంటిపిల్లల తల్లిదండ్రుల దర్శనాలు రద్దు. విజిలెన్స్ పోలీసు విభాగాల సమన్వయంతో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పార్కింగ్ స్థలాలు ఎంపిక పక్కాగా ఉండాలని అదనపు ఇఒ ఆదేశించారు. భక్తులకు దర్శన క్యూలైన్లు, ఆలయ మాఢవీదుల్లోకి చేరుకునేలా గ్యాలరీలు, ముఖ్యమైన ప్రాంతాల్లో విరివిగా అన్నప్రసాదాల పంపిణీకి కౌంటర్లు, ఇంజనీరింగ్ పనులు, విద్యుద్దీపాలంకరణలు, ఫలపుష్ప ప్రదర్శన ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు శ్రీవారిసేవకు యువతీ యువకలను ఆహ్వానించిమెరుగైన సేవలంది ంచేందుకు కృషి చేయాలని చౌదరి ఆదేశించారు. సెప్టెంబర్ 27వతేదీ రాత్రి నుండి 29వతేదీ ఉదయం 6గంటల వరకు తిరుమల ఘాట్లో ద్విచక్రవాహనాలు నిషేధం..భక్తుల రద్దీకి తగ్గట్లు లడ్డూలు నిల్వవుంచు కోవాలన్నారు.

## భాషల పేరిట.. అడ్డుగోడలొద్దు..

పవన్ కల్యాణ్ అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలి బాలయోగి స్టేడియంలో ఏర్పాటు చేసిన రాజ్య భాషా విభాగ స్వర్ణోత్సవ వేడుకల్లో ప్రసంగిస్తూ.. దక్షిణ భారతీయ సినిమాల్లో 31 శాతం హిందీ డబ్బింగ్ ద్వారానే ఆదాయం వస్తుందని గుర్తు చేశారు. వ్యాపారానికి హిందీ అవసరమైనప్పుడు, నేర్చుకోవడానికి వచ్చిన ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు.

**భాష నేర్చుకోవడం ఓటమి కాదు..**


తన సినిమాలో "ఏ మేరా జహా" అనే హిందీ పాట పెట్టడానికి గల కారణాన్ని వివరిస్తూ.. మాతృభాష తెలుగు అయినప్పటికీ, హిందీ దేశ భాష అని చెప్పడానికే అలా చేశానని తెలిపారు. హిందీ నేర్చుకోవడం అంటే మన ఉనికిని కోల్పోవడం కాదని, మరింత బలపడటమని పవన్ స్పష్టం చేశారు. మరో భాషను అంగీకరించడం ఓటమి కాదని, కలిసి ప్రయాణించడమని ఉద్ఘాటించారు.

**అడ్డుగోడగా భావించొద్దు..**

విద్య, వైద్యం, వ్యాపారం, ఉపాధి వంటి రంగాల్లో భాషా అవధులు చెరిగిపోతున్న ఈ సమయంలో హిందీని వ్యతిరేకించడం రాబోయే తరాల అభివృద్ధిని అడ్డుకోవడమేనని పవన్ అభిప్రాయపడ్డారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం వంటి మాతృభాషలపై గౌరవం ఉండాలని చెబుతూనే, హిందీని పెద్దమ్మ భాషగా అభివర్ణించారు. ఇంట్లో మాట్లాడుకోవడానికి మాతృభాష ఉండగా, దేశ సరిహద్దులు దాటితే హిందీ రాజ్య భాషగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రపంచం విడిపోవడానికి కారణాలు వెతుకుతుంటే, భారతదేశం మాత్రం ఒకే భాషతో ఏకం కావాలని చూస్తోందని, అది హిందీతో సాధ్యమవుతుందని అన్నారు.

**అన్ని భాషలకు సమున్నత గౌరవం**

ఒక బెంగాలీ గీతం జాతీయ గీతమైందని, ఒక పంజాబీ దేశం కోసం పోరాడారని, రాజస్థాన్‌కు చెందిన రాణప్రతాప్ శౌర్యానికి చిహ్నంగా నిలిచారని, తమిళనాడుకు చెందిన అబ్దుల్ కలాం మిస్సైల్ మ్యాన్ అయ్యారని, మద్రాస్ ప్రెసిడెన్సీకి చెందిన వ్యక్తి రూపొందించిన మువ్వన్నెల జెండా దేశానికి తిరంగా అయిందని ఉప ముఖ్యమంత్రి పవన్ గుర్తు చేశారు. ప్రతి భాషా జీవ భాష, మాతృ భాష అయినప్పటికీ, రాజ్య భాష మాత్రం హిందీయేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు..



## గోదావరికి భారీగా.. వరద నీరు

వరద ప్రవాహం ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో రెండూ 2.9 లక్షల క్యూసెక్కులుగా నమోదైనట్లు తెలిపింది. వరద నీరు భారీగా దిగువకు రావడం ప్రారంభమైందని సూచించింది.

**గోదావరికి పెరుగుతున్న వరద ప్రవాహం అలర్ట్ జారీ చేసిన ఏపీఎస్‌డీఎంఏ**

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదికి వరద ప్రవాహం పెరుగుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) ఎండి ప్రఖర్ జైన్ శుక్రవారం వెల్లడించారు. నదిలో నీటిమట్టం పెరుగుతున్న దృష్ట్యా, గోదావరి నదీ పరీవాహక ప్రాంతాలు, లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 37.2 అడుగులకు చేరుకుందని ప్రఖర్ జైన్ తెలిపారు. అదేవిధంగా, ధవళేశ్వరం వద్ద ప్రస్తుతానికి ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 2.9 లక్షల క్యూసెక్కులుగా నమోదైందని పేర్కొన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో, దిగువ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఎస్‌డీఎంఏ హెచ్చరించింది. వరద పరిస్థితుల దృష్ట్యా, ప్రజలు అత్యవసర సహాయం కోసం 24 గంటలు అందుబాటులో ఉండే స్టేట్ కంట్రోల్ రూమ్ నెంబర్లు 112, 1070, 1800 425 0101 ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

**వరద ప్రభావితులకు కీలక సూచనలు**

వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో ప్రజల భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ప్రజలు బోట్లు, మోటార్ బోట్లు, స్టీమర్లలో ప్రయాణం చేయకూడదని హెచ్చరించింది. అలాగే వరద నీటిలో ఈత కొట్టడం, చేపలు పట్టడం, స్నానం చేయడం వంటి పనులు పూర్తిగా నివారించాలని సూచించింది. ప్రస్తుత పరిస్థితిని స్థానిక అధికారులు, విపత్తు నిర్వహణ బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని %ూూూణహీూ% తెలిపింది. ప్రజలు అధికారుల సూచనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ప్రఖర్ జైన్ పేర్కొన్నారు.

## ట్రంప్ కొత్త బిల్లు ఎఫెక్ట్..

బిల్లు యాక్ట్ కింద నాన్-ఇమిగ్రేషన్ వీసాల ఫీజును పెంచింది. ఈ ఫీజును రూ. 26 వేలకు పెంచింది. అమెరికా వెళ్లాలనుకునే భారతీయులకు కూడా ఈ ఫీజు వర్తిస్తుంది. అమెరికా పర్యటనకు, ఉన్నత విద్యకు, ఉద్యోగం కోసం వెళితే ఈ ఫీజును చెల్లించవలసి ఉంటుంది. టూరిస్ట్ వీసా ఫీజును రూ. 16 వేల నుంచి రూ. 40 వేలకు పెంచింది. యూఎస్ వీసా ఇంటిగ్రిటీ ఫీజు కింద 250 అమెరికన్ డాలర్లను చెల్లించవలసి ఉంటుంది. అంటే రూ. 21,400 చెల్లించాలి. ఈ మొత్తాన్ని వెనక్కి ఇవ్వరు. దీనికి అదనంగా సర్‌ఛార్జీని వసూలు చేస్తారు. వీసా జారీ చేసే సమయంలో ఈ మొత్తాన్ని చెల్లించవలసి ఉంటుంది. బీ1, బీ2 (టూరిస్ట్ అండ్ బిజినెస్ వీసాలు), ఎఫ్ అండ్ ఎం (విద్యార్థి వీసాలు), హెచ్1బీ (వర్క్ వీసా), జే (ఎక్స్‌చేంజ్ విజిటర్ వీసా) వీసాలకు ఈ మొత్తం చెల్లించవలసి ఉంటుంది. డిప్లొమాటిక్ వీసా కలిగిన వారికి మాత్రం దీని నుంచి మినహాయింపు ఇచ్చింది. విద్యార్థులు, సాంకేతిక నిపుణులు, పర్యాటకులు, వ్యాపారం కోసం ప్రయాణాలు చేసే వారిపై ఈ ఫీజుల ప్రభావం పడనుంది. బీ2 టూరిస్ట్ వీసా ఖర్చు ప్రస్తుతం రూ. 15 వేలుగా ఉంటే, ఇప్పుడు అదనంగా ఇంటిగ్రిటీ ఫీజు కింద రూ. 21 వేలు చెల్లించవలసి ఉంటుంది. దీంతో మొత్తం ఖర్చు రూ.35 వేలు దాటుతుంది. హెచ్1బీ వీసా ధర ఇప్పటి వరకు స్వల్పంగా ఉంది. కానీ బిగ్ బ్యూటిఫుల్ బిల్లు ప్రకారం భారీగా పెరిగింది. ఇదిలా ఉండగా, వీసా ఇంటిగ్రిటీ ఫీజును కొన్ని సందర్భాలలో వెనక్కి ఇస్తారు. వీసా హోల్డర్ అమెరికాలో ఉన్న సమయంలో ఇమ్మిగ్రేషన్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తే తిరిగి ఇస్తారు. అలాగే ఐ-94 గడువు ముగియడానికి ఐదు రోజుల కంటే ముందుగా అమెరికాను విడిచి వెళ్లిన వారికి కూడా చెల్లిస్తారు. ఈ వీసా ఫీజుల పెంపు 2026 సంవత్సరం నుంచి అమలులోకి రానుంది.




## ఇప్పుడు జనాభానే.. గొప్ప ఆస్తి..

స్ఫూర్తితో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. నాడు ఎన్టీఆర్ తాతమ్మ కల అనే సినిమా తీశారని, ఎందరు పిల్లలుంటే అంత సంతోషమని అందులో చూపించారని వివరించారు. పిల్లలను కనే వరం భగవంతుడు మహిళలకు ఇచ్చాడని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్ర సచివాలయం వద్ద ప్రపంచ జనాభా దినోత్సవంపై మొదటి అమరావతి సమ్మిట్‌కు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జనాభా నిర్వహణా విధానం ప్రతి కుటుంబం ముఖ్యం-మీ అభిప్రాయం మార్గదర్శనం అనే కాన్సెప్ట్‌తో రూపొందించిన సర్వేను సీఎం ప్రారంభించారు. అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగించారు.

**ప్రత్యుత్పత్తి రేటు పెరగాలి**

ఒకప్పుడు జనాభా పెద్ద సమస్యగా ఉండేది. 2004కు ముందు సీఎంగా ఉన్నప్పుడు జనాభా నియంత్రణకు ప్రోత్సాహకాలు ఇచ్చాను. ఇద్దరు పిల్లల కంటే ఎక్కుమంది ఉంటే స్థానిక సంస్థల్లో పోటీకి అనర్హులని చేస్తూ చట్టాన్ని తెచ్చాను. ఇప్పుడు ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ ఉన్నవారు స్థానిక సంస్థల్లో పోటీకి అర్హులుగా చట్టం తీసుకురావాల్సిన అవసరం ఏర్పడింది. దేశం అంటే రాష్ట్రాలు, ప్రాంతాలు, పట్టణాలు, సరిహద్దులు, భూభాగాలు మాత్రమే కాదు, దేశం అంటే మనుషులు.

**మన బలం మానవ వనరులు**

ఈ రోజు ప్రపంచంలో 10 నుంచి 24 ఏళ్ల వయసు ఉన్నవారు 1.8 బిలియన్లు ఉన్నారు. ఒకప్పుడు జనాభా ఎక్కువ ఉన్న దేశాలను చులకనగా చూసేవారు. కానీ జనాభా ఉన్న దేశాలవైపే అగ్రరాజ్యాలు చూడాల్సి వస్తోంది. జనాభా ఎప్పటికీ భారం కాదు...అదే మనకు తిరుగులేని ఆస్తి. ఎక్కువ జనాభా ఉన్న మన దేశంలో అభివృద్ధి సాధ్యమా అనే పరిస్థతి నుంచి ఆ జనాభానే మనకు అడ్వాంటేజ్‌గా మారింది. 140 కోట్ల జనాభా కలిగి ఉన్న మన దేశం చైనాను కూడా వెనక్కు నెట్టింది.

**యువశక్తి తగ్గి... వృద్ధులు పెరుగుతున్నారు**

ఏ దేశంలోనైతే వయోజన సమస్య వస్తుందో అక్కడ వృద్ధిరేట్ నిలిచిపోతుంది. భవిష్యత్‌లోనూ సమస్యలు వస్తాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో సంతానోత్పత్తి రేట్ పడిపోతోంది. అమెరికాలో 1.62 శాతం, యూకేలో 1.54 శాతం, హంగేరిలో 1.50 శాతం, ఫ్రాన్స్‌లో 1.49 శాతం, రష్యాలో 1.47 శాతం, జర్మనీలో 1.46 శాతం, కెనడాలో 1.33 శాతం, జపాన్‌లో 1.23 శాతం, చైనాలో 1.02 శాతం, సింగపూర్‌లో 0.96 శాతం ఉంది. సంపన్న దేశాల్లో తక్కువ జననాల రేటు కన్పిస్తోంది.

**పిల్లలను కనేవారికి విదేశాల్లో ప్రోత్సాహకాలు**

జపాన్‌లో పిల్లలు స్కూలుకు వెళ్లే వరకు చైల్డ్ కేర్ సేవలను అందించడంతో పాటు పిల్లల చదువుకు ఆర్థిక సాయం లేదా ఉచిత విద్యను అందిస్తున్నారు. ఎక్కువమంది పిల్లలుంటే ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక సాయంతో పాటు తక్కువ రెంట్‌తో ఇల్లు అద్దెకు ఇస్తున్నారు. దక్షిణ కొరియా దేశంలో నెలవారీగా ప్రత్యక్ష నగదు బహుమతులు అందించడంతోపాటు వివాహం, కాన్పులకు, ఐవిఎఫ్ గర్భధారణకు సాయం చేస్తున్నారు. సింగపూర్ దేశంలో బేబీ బోనస్ స్కీమ్ కింద పుట్టిన ప్రతి శిశువు కోసం కొంత నగదు అందిస్తున్నారు. మ్యాచ్ సేవింగ్స్ కింద ప్రభుత్వ సొమ్మును జోడించి పిల్లల ఖాతాల్లో వేస్తున్నారు. రష్యాలో రెండవ బిడ్డను కంటే ఫ్రీ హెల్త్‌కేర్ కింద గర్భిణీలకు ఉచిత వైద్యం అందిస్తున్నారు. హంగేరీలో నలుగురు కంటే ఎక్కువ పిల్లలు ఉన్న వారికి జీవితాంతం ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఇస్తున్నారు. చైనాలో ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలుంటే రూ.12 లక్షలు ఆర్థిక సాయం చేస్తున్నారు.

**ఖర్చులు పెరుగుతున్నాయని పిల్లల్ని కనడం లేదు**

జనాభా తగ్గిపోతే వృద్ధి రేటు పడిపోతుందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా పెరుగుదలపై సమావేశంలో పోల్ నిర్వహిస్తే ఇద్దరు పిల్లలుండాలని 67.41 శాతం మంది, ఒకరే ఉండాలని 12.34 శాతం మంది, ముగ్గురు పిల్లలుండాలని 19.88 శాతం మంది అభిప్రాయపడ్డారని వివరించారు. పిల్లలను కనడానికి యువత ఆస్తకి చూపడం లేదని, చాలా మంది భార్యాభర్తలు పిల్లలను వద్దనుకునే పరిస్థితికి వచ్చారని అన్నారు. ఖర్చులు పెరుగుతాయని పిల్నల్లి కనడానికి ఇష్టపడటం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

**ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్నాయి**

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి... రానురాను అవి కనుమరుగవుతున్నాయి. గత కొన్నేళ్ల వరకు ఇంట్లో ప్రతి ఒక్కరికీ 5 కేజీల చొప్పున బియ్యం ఇచ్చేవాళ్లం. ఐదుగురు ఉంటే 25 కేజీలు ఇచ్చేవాళ్లం. అంతకంటే ఎక్కువమంది ఉంటే బియ్యం ఇచ్చేవాళ్లం కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ఒక కుటుంబంలో పది మంది ఉన్నా 50 కేజీల కంటే ఎక్కువ ఇచ్చేదానిపై ఆలోచిస్తున్నాం. దక్షిణ భారత దేశంలో జనాభా తగ్గిపోతుండడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. భవిష్యత్‌లో పార్లమెంటు సీట్లు పెరుగుతాయి.. కానీ దక్షిణ భారత దేశంలోని రాష్ట్రాలకు సీట్లు తగ్గిపోతాయని కొందరు ఆందోళన చెందుతున్నారు... అని చంద్రబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ మహేంద్ర దేవ్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, మైనా మహిళా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సుహానీ జలోటా, పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్ ఎమ్.ప్రకాశమ్మ, ప్రొఫెసర్ సంజయ్ కుమార్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రంగరాయ మెడికల్ కళాశాలలో కీచకపర్వం

వేధింపులకు పాల్పడుతున్న సిబ్బందిలో ఇద్దరు బెదిరించినట్టు కూడా తెలిసింది. తాను శాశ్వత ఉద్యోగినని, తనను ఎవరూ ఏమీ చేయలేరని ల్యాబ్ సహాయకుడు ఒకరు విద్యార్థినులను బెదిరించినట్టు కూడా సమాచారం. అంతేకాదు, కొందరు ల్యాబ్ అసిస్టెంట్లు విధులకు మద్యం తాగి వస్తున్నారని కూడా కమిటీకి తెలిపారు. అయితే, తాము ఎవరిపట్లా అసభ్యంగా ప్రవర్తించలేదని విచారణలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బంది చెప్పినట్టు తెలిసింది. వేధింపుల వ్యవహారం నిజమేనని, విచారణ జరిపించామని, ఇందుకు సంబంధించిన నివేదిక రావాల్సి ఉందని ప్రిన్సిపల్ డాక్టర్ విష్ణువర్ధన్ చెప్పారు. ఆరోపణలు నిజమని తేలితే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

**వైద్య కళాశాల ఘటనపై సిఎం చంద్రబాబు ఆదేశం**

తూర్పు గోదావరి జిల్లా కాకినాడలోని రంగరాయ వైద్యకళాశాల ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినుల పట్ల లైంగిక వేధింపుల ఘటనకు సంబంధించి వైద్యారోగ్యశాఖ అధికారులు సిఎం కు నివేదిక అందించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ల్యాబ్ టెక్నీషియన్లు జిమ్మీ రాజు, గోపాలకృష్ణ, ప్రసాద్‌ను పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. రంగరాయ వైద్యకళాశాలలో బీఎస్సీ, డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ కోర్సుల విద్యార్థినుల పట్ల కొందరు సిబ్బంది లైంగిక వేధింపులకు పాల్పడుతున్న అంశం వెలుగుచూసింది. ముఖ్యంగా ల్యాబ్ సహాయకుడు ఒకరు, మరో ఉద్యోగి వికృత చేష్టలపై కళాశాల ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు అందింది. ఈ నెల 8న కొందరు విద్యార్థినులు ఫ్యాకల్టీ వద్ద విలపించడంతో కళాశాల అంతర్గత కమిటీ ద్వారా విచారణ జరిపించారు. మైక్రోబయాలజీ, పాథాలజీ, బయో కెమిస్ట్రీ విభాగాల్లో కొందరు సిబ్బంది తమ పట్ల అసభ్యంగా వ్యవహరించిన తీరును దాదాపు 50 మంది విద్యార్థినులు కమిటీ ముందు చెప్పారు. ఈ విషయాన్ని కళాశాల విద్యార్థినులు కొందరు మీడియా దృష్టికి తీసుకువచ్చారు. సిబ్బందిలో ఇద్దరు వ్యక్తులు తమను వేధించినట్లు విచారణలో తెలిపామన్నారు.

## మెగా పీటీఎం 2.0 గ్రాండ్ సక్సెస్ అయింది

పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం పెంచడం, విద్యార్థుల ప్రగతిని సమీక్షించడం, పాఠశాలల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. 'మెగా పీటీఎం 2.0' ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా ప్రమాణాల పెంపునకు సంబంధించిన అనేక అంశాలపై చర్చించడం జరిగిందని మంత్రి వివరించారు. తల్లిదండ్రుల నుంచి వచ్చిన సూచనలు, సలహాలను స్వీకరించి, వాటిని అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన హామీ ఇచ్చారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని, విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని నారా లోకేశ్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నూతనోత్సాహం నింపడమే కాకుండా, వారి భవిష్యత్ నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్రను మరింత క్రియాశీలం చేసిందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# భారత్‌కు నష్టం కలిగిందనే ఒక్క ఆధారం చూపండి..

## అజిత్ దోభాల్ సవాల్

పంజాబ్ : 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్ చేసిన దాడుల్లో భారత్‌కు నష్టం కలిగిందని విదేశీ మీడియా చేస్తున్న ప్రచారాలపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పాక్ దాడుల్లో భారత్‌కు నష్టం కలిగిందనే విషయాన్ని రుజువు చేయడానికి ఏ ఒక్క ఆధారాన్ని అయినా చూపాలని సవాలు విసిరారు. చైన్నైలోని ఓ కార్యక్రమానికి హాజరైన దోభాల్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం పాక్‌లోని ఉగ్రస్థావరాలను ఎలా ధ్వంసం చేసిందనే విషయాలను వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో స్వదేశీ రక్షణ సాంకేతికతను వినియోగించి దాయాదికి ముచ్చెమటలు పట్టించామని అన్నారు.



సోషల్ మీడియాలో విదేశీ వార్తాసంస్థలు ఆపరేషన్ సిందూర్‌పై ప్రచారం చేస్తున్న తప్పుడు కథనాలను దోభాల్ కొట్టిపడేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ అది చేసింది.. ఇది చేసిందంటూ విదేశీ మీడియా అసత్య కథనాలు ప్రసారం చేసిందని మండిపడ్డారు. ఆ దేశంలో ఉగ్రస్థావరాలు ఎక్కడెక్కడ ఉన్నాయనే అత్యంత కచ్చితమైన సమాచారంతోనే భారత సైన్యం దాడులు నిర్వహించిందన్నారు. పాకిస్థాన్‌లోని 13 వైమానిక స్థావరాలు ధ్వంసమైన ఫొటోలు మాత్రమే బయటకు వచ్చాయి కానీ.. భారత్‌కు నష్టం జరిగినట్లు ఒక్క ఫొటో కూడా లేదని వ్యాఖ్యానించారు. భారత్‌కు చెందిన ఆయుధ స్థావరాలపై దేశ సైన్యం చిన్నగీత కూడా పడనివ్వలేదని అన్నారు.

భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను, యుద్ధ పరిస్థితులను ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా రక్షణ రంగానికి అవసరమైన సాధన సంపత్తిని దేశీయంగానే రూపొందిస్తోందని దోభాల్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధ విమానాల ద్వారా ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్ భూభాగాల లోపలి వరకూ వెళ్లి ఆ దేశానికి చెందిన పలు వైమానిక స్థావరాలను దెబ్బతీశాయన్నారు. పాకిస్థాన్ సైన్యం దిల్లీ లక్ష్యంగా ప్రయోగించిన ఫతాహ్-11 బాలిస్టిక్ క్షిపణులను భారత బలగాలు... గగనతల రక్షణ వ్యవస్థ ఎస్-400తో మధ్యలోనే సమర్థమంతంగా పేల్చివేశాయని తెలిపారు.

# డాలర్‌కు ప్రత్యామ్నాయ పరిస్థితి.. అమెరికా స్వయంకృతాపరాధమే : జీటీఆర్ఐ

అమెరికా : ప్రత్యర్థి దేశాలను బెదిరించేందుకు అమెరికా చేపట్టే ఆర్థిక చర్యలే.. వాటిని డాలర్ ప్రత్యామ్నాయం వైపు నెడుతున్నట్లు గ్లోబల్ ట్రేడ్ రీసెర్చి ఇనీషియేటీవ్ సంస్థ అభిప్రాయపడింది. ముఖ్యంగా అంతర్జాతీయ పేమెంట్స్ వ్యవస్థ స్విఫ్ట్‌ను ఉపయోగించకుండా నిషేధానికి గురైన రష్యా, ఇరాన్, వెనుజువెలా వంటి దేశాలు డాలర్లలో చెల్లింపుల స్వీకరణను నిలిపేసేలా చేసిందని వెల్లడించింది. దీంతో భారత్, చైనా వంటి దేశాలు వాటి కరెన్సీల్లోనే ట్రేడింగ్ చేస్తున్నాయని పేర్కొంది.



డాలరేతర కరెన్సీల్లో ట్రేడింగ్ చేస్తున్నందుకు బ్రిక్స్ దేశాలపై 10 శాతం పన్నును ట్రంప్ ప్రతిపాదించారు. వాషింగ్టన్ ఒంటెద్దు పోకడల వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్న విషయాన్ని గుర్తించడం లేదని జీటీఆర్ఐ శుక్రవారం వెల్లడించింది.

"వివిధ దేశాలు డాలర్ నుంచి దూరంగా జరగడం తిరుగుబాటు కాదు. వారికి మిగిలింది అదొక్కటే మార్గం. రష్యా-చైనాల మధ్య 90శాతం వాణిజ్యం రూబుల్ లేదా యువాన్‌లలో జరుగుతోంది. భారత్ రూపాయలు, దిర్హామ్‌ల్లో రష్యా చమురు కొనుగోలు చేసినందుకు గాను చెల్లింపులు చేస్తోంది. చివరికి పెట్రో డాలర్ ఒప్పందం చేసుకొన్న సౌదీఅరేబియా కూడా డాలరేతర చమురు వ్యాపారానికి తెర తీసింది. అమెరికా ఆంక్షలే ఆయా దేశాలను తొలుత డాలర్ ప్రత్యామ్నాయాలు వెతికేటట్లు చేస్తోంది. ఇక బ్రిక్స్ దేశాలపై 10శాతం పన్ను.. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తే 500శాతం టారిఫ్‌లు అమెరికాతో వాణిజ్య ఒప్పందాలను మరింత జఠిలం చేస్తున్నాయి" అని జీటీఆర్ఐ అజయ్ శ్రీవాస్తవ అభిప్రాయపడ్డారు.


ప్రపంచవ్యాప్తంగా 200 దేశాల్లోని 11,000 బ్యాంక్‌లను స్విఫ్ట్ వ్యవస్థ అనుసంధానిస్తుందని శ్రీవాస్తవ వెల్లడించారు. ఇది తటస్థ వేదికగా చెబుతారు. కానీ, అమెరికా ఒత్తిడి కారణంగా ఇరాన్, వెనుజువెలా, రష్యాలకు స్విఫ్ట్ సేవలను నిలిపివేశారన్నారు. దీంతో ఈ దేశాల నుంచి చమురు, గ్యాస్ కొనేవారు.. డాలర్‌కు ప్రత్యామ్నాయాలను ఎంచుకొని చెల్లింపులు చేస్తున్నారని చెప్పారు. ఇవి ఆయా దేశాల డాలర్ వ్యతిరేక విధానాలు కాదని.. రక్షణాత్మక వ్యవస్థలని చెప్పారు. వీటిని ప్రేరేపించేవి అమెరికా ఆంక్షలే అని వెల్లడించారు.

డాలర్ల కొరత ఉన్న దేశాలతో ట్రేడ్ సెటిల్మెంట్లు రూపాయల్లో చేసుకొనేందుకు 2022లో ఆర్‌బీఐ అనుమతించింది. ఈక్రమంలో రష్యా బ్యాంకులు చమురు చెల్లింపుల సెటిల్మెంట్లు కూడా రూపీ అకౌంట్స్‌ను తెరిచాయి. మరోవైపు బ్రిక్స్‌కు కామన్ కరెన్సీని తీసుకురావాలన్న ప్రతిపాదనను భారత్, చైనాలు తిరస్కరించాయి. స్థానిక కరెన్సీల్లో ట్రేడింగ్ చేసుకొంటే.. డబుల్ డాలర్ కన్వెర్షన్లను తప్పించుకోవచ్చు.. అప్పుడు కనీసం 4శాతం వరకు అయ్యే ఖర్చు ఆదా అవుతుందని జీటీఆర్ఐ నివేదికలో అభిప్రాయపడింది. ఈవిషయాన్ని ఆయా దేశాలు గ్రహించేకొద్దీ స్థానిక కరెన్సీల్లోనే ట్రేడింగ్ జరుగుతుందని వెల్లడించింది.

# హిమాచల్ ప్రదేశ్‌లో వరదలు..

## 150 కి.మీ. దూరంలో మృతదేహాలు

**హిమాచల్ ప్రదేశ్ :** హిమాచల్ ప్రదేశ్‌లో వరద ఉద్ధృతి ఇంకా కొనసాగుతోంది. మండి జిల్లాలో భారీ వర్షాల కారణంగా మరణించిన వారి సంఖ్య 91కి చేరింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన రహదారులపై కొండచరియలు విరిగిపడటం.. మెరుపు వరదలు, కుంభవృష్టితో పరిస్థితి దారుణంగా ఉంది. వరద ఉద్ధృతి కారణంగా కొట్టుకుపోయిన మృతదేహాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. వరద నీటిలో కొట్టుకుపోయిన మృతదేహాలు రహదారులపై పదుల సంఖ్యలో పడి ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. హిమాచల్‌లోని పంగ్లుయెడ్ గ్రామంలో ఇటీవల రెండు కుటుంబాలకు చెందిన తొమ్మిది మంది గల్లంతయ్యారు. వారిలో నలుగురి మృతదేహాలు దాదాపు 150 కి.మీ. దూరంలో ఉన్న జ్వాలాపుర్‌లో లభ్యమవగా.. మరో ఐదుగురి ఆచూకీ ఇంకా తెలియకపోవడంతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మృతదేహాలు చాలాదూరం కొట్టుకుపోతుండడంతో వాటిని గుర్తించి.. వారి కుటుంబాలకు అప్పగించడం కూడా సవాలుగా మారిందని అధికారులు పేర్కొన్నారు.



హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు, వరదల కారణంగా ఇప్పటివరకు 91 మంది మరణించగా.. 34 మంది గల్లంతయినట్లు అధికారులు పేర్కొన్నారు. దాదాపు 130 మంది క్షతగాత్రులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వరదల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 207 రోడ్డు మార్గాలను మూసివేశారని.. పలు ప్రాంతాల్లో చీకట్లు అలముకున్నాయని తెలిపారు. వందల సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులయ్యారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన బృందాలు, బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ దళాలు సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ఆరెంజ్ అలర్ట్ కొనసాగుతోంది. చాలాచోట్ల కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉండడంతో బలహీనమైన నిర్మాణాల్లో ఎవరూ ఉండొద్దని అధికారులు ప్రజలను హెచ్చరించారు.

# రష్యా చమురును డిస్కౌంట్‌లో భారత్ కొనకపోయి ఉంటే..

## కేంద్రమంత్రి కీలక వ్యాఖ్యలు





రష్యా : ఉక్రెయిన్‌పై యుద్ధం సాగిస్తున్న రష్యాపై పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ మాస్కో నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడంపై అప్పట్లో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీనిపై న్యూదిల్లీ ఎప్పటికప్పుడు స్పష్టతనిస్తూనే ఉంది. తాజాగా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి దీనిపై మరోసారి స్పందించారు. రష్యా నుంచి చమురు కొని తాము ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మేలు చేశామన్నారు. లేదంటే అంతర్జాతీయ మార్కెట్లో ధరలు ఆకాశన్నంటేవని తెలిపారు.

"రష్యా చమురును ఎన్నడూ ఆంక్షల పరిధిలోకి తీసుకురాలేదు. కేవలం దాని ధరపై మాత్రమే పరిమితి విధించారు. ప్రపంచ చమురు సరఫరా గొలుసు ఎలా ఉంటుందన్న వాస్తవం చాలామందికి తెలుసు. రష్యా నుంచి డిస్కౌంట్లో వచ్చిన చమురును భారత్ కొనుగోలు చేయడం వల్ల ప్రపంచ మార్కెట్లకు మేలే జరిగింది. లేదంటే చమురు ధరల మోత మోగేది" అని పురి అన్నారు.

"సాధారణంగా రష్యా రోజుకు 9 మిలియన్ బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేస్తోంది. ప్రపంచంలోని అతిపెద్ద ముడిచమురు ఉత్పత్తిదారుల్లో మాస్కో ఒకటి. ఇక, ప్రపంచవ్యాప్తంగా రోజుకు 97 మిలియన్ బ్యారెళ్ల చమురు సరఫరా అవుతోంది. ఆంక్షల కారణంగా ఇందులో 9 మిలియన్ బ్యారెళ్ల సరఫరా ఒక్కసారిగా ఆగిపోతే.. ప్రపంచ వినియోగంలో 10శాతం తగ్గించుకోవాల్సి వస్తుంది. అది అసాధ్యం. అప్పుడు సరఫరా తగ్గడంతో బ్యారెల్ చమురు ధర 120-130 డాలర్లకు పెరిగేది" అని కేంద్రమంత్రి వివరించారు. ఎనర్జీ మార్కెట్‌ను అర్థం చేసుకోలేనివారే ఇలాంటి అంశాలపై మాట్లాడతారని ఆయన దుయ్యబట్టారు.

# 10వేల జనాభా లేని దేశాలకు ప్రధాని పర్యటనలా?: పంజాబ్ సీఎం





పంజాబ్ : ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఐదు దేశాల పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. మోదీ విదేశీ పర్యటనలపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈక్రమంలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కూడా ప్రధాని పర్యటనలపై కీలక వ్యాఖ్యలు చేశారు. 140 కోట్ల మంది ప్రజలు ఉన్న భారత్‌ను వదిలేసి.. కేవలం 10 వేల మంది జనాభా ఉన్న దేశాల్లో మోదీ పర్యటించడాన్ని ఆయన విమర్శించారు.

'ప్రధాని ఘనా అని ఎక్కడికో వెళ్లారు. స్వదేశానికి తిరిగివస్తున్న ఆయనకు స్వాగతం. ప్రధాని ఏయే దేశాలకు వెళ్తున్నారో ఆ దేవుడికే తెలియాలి. 140 కోట్ల మంది జనాభా ఉన్న దేశంలో మన ప్రధాని ఉండరు. కానీ, పది వేల మంది జనాభా ఉన్న దేశాలను మాత్రం సందర్శిస్తున్నారు. అక్కడ ఆయనకు అత్యున్నత అవార్డులు కూడా అందుతున్నాయి' అని మాన్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై విదేశాంగశాఖ మండిపడింది. ప్రధాని విదేశీ పర్యటనలపై రాష్ట్రంలోని ఉన్నతస్థానంలో ఉన్న వ్యక్తి చేసిన వ్యాఖ్యలు తమ దృష్టికి వచ్చాయని మాన్ పేరును ప్రస్తావించకుండా పేర్కొంది. అవి పూర్తిగా బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని తెలిపింది. ఈ వ్యాఖ్యలు వారి స్థాయిని తగ్గించేవని మండిపడింది. భారత్‌తో స్నేహపూర్వకంగా మెలిగే దేశాలను తక్కువ చేసి మాట్లాడటం సబబు కాదని పేర్కొంది.

ఇక కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా మోదీ విదేశీ పర్యటనలపై విమర్శలు చేశారు. ప్రధాని మరో పర్యటనకు వెళ్లేలోపు ఓ మూడు వారాలు మన దేశంలో ఉంటారేమో! ఇప్పుడైనా మణిపుర్ వెళ్లడానికి ఆయనకు తీరిక దొరుకుతుందో, లేదో అని ఆయన ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో పహల్గాం ఉగ్రవాది దోషులను ఇప్పటివరకు న్యాయస్థానం ముందు ఎందుకు నిలబెట్టలేదో కూడా ఆయన సమీక్ష చేయొచ్చన్నారు. కాగా.. ఈనెల 2 నుంచి మోదీ విదేశీ పర్యటనకు వెళ్లారు. ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాల్లో ఆయన పర్యటించారు. ఈ నేపథ్యంలో ఆయన ఆయా దేశాల పార్లమెంట్లను ఉద్దేశించి ప్రసంగించారు.






తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com
శనివారం 12 జులై 2025

# ప్రజల కోసమే పనిచేసే ప్రభుత్వం 'కూటమి'

## ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు






అల్లవరం జూల్కై 11 (తెలుగురాష్ట్రం విలేకరి)

అల్లవరం మండలం, సామంతకుర్రు గ్రామంలో జరిగిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సత్తిబాబురాజు , రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, వేగిరాజు వెంకటరాజు, అల్లవరం చైర్మన్ దాట్ల గోపిరాజు, పచ్చిమాల ఏడుకొండలు, యాళ్ళ కాసుబాబు,కాకిలేటి సూరిబాబు మరియు తదితరులు పాల్గొన్నారు

# కూటమి హాయంలో సుపరిపాలన : ఎమ్మెల్యే ఆనందరావు




నంగవరం జూల్కై 11 (తెలుగురాష్ట్రం విలేకరి)

నంగవరం గ్రామంలో జరిగిన సుపరిపాలన తొలిఅడుగు కార్యకమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ దేశంశెట్టి లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షులు అరిగేలా నానాజీ, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటల రామం, గుత్తుల నాగేశ్వరరావు, గుర్లింకి చిన్న, చీకట్ల ఏసుబాబు, మాజీ బొర్రా ఈశ్వరరావు, ఆకుల వెంకటరమణ, ఇసుకపట్ల రఘుబాబు, రవణం మధు పెమ్మిరెడ్డి సత్యనారాయణ, చిక్కం ఉమేష్ మరియు తదితరులు పాల్గొన్నారు




# కూటమితోనే పేదలకు సంక్షేమ ఫలాలు

## సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుతో పాటు కలిసి పాల్గొన్న ఎమ్మెల్సీ పేరబత్తుల రాజశేఖరం




అమలాపురం జూల్కై 11 (తెలుగురాష్ట్రం విలేకరి)

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాలు పేదలందరికీ దక్కుదాయని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనంరదావు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. అమలాపురం రూరల్ మండలం, ఎ. వేమవరం గ్రామంలో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుతో పాటు కలిసి పాల్గొన్న mlcపేరబత్తుల రాజశేఖరం పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమాల గురించి ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, మాజీ zptc శ్రీమతి అధికారి జయవెంకటలక్ష్మి బాబ్జి, మాజీ mppబొర్రా ఈశ్వరరావు, జిల్లా రైతు అధ్యక్షులు మట్టా మహాలక్ష్మి ప్రభాకర్, మండల టిడిపి అధ్యక్షులు చొల్లంగి సాయిబాబు, వీరేష్ కుమార్, రావూరి భాస్కరరావు, దాసం గోపి, నెహ్రూ, సుబ్బారావు, మాడ మాధవి, మంద గెద్దయ్య, గొల్లపల్లి రాజేష్ మరియు తదితరులు పాల్గొన్నారు




# గోదావరి వరదలను ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి

## - అమలాపురం ఆర్డీవో మాధవి



అల్లవరం, జూలై 10, (తెలుగురాష్ట్రం విలేకరి)

గోదావరి వరదలు, తుఫాన్లు వంటి ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మండల స్థాయి యంత్రాంగం సమాయత్తం కావాలని ఆర్డీవో అమలాపురం కే.మాధవి ఆదేశించారు. గురువారం అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో ఆమె మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గోదావరి వరదలను ఎదుర్కొనేందుకు పక్కా కార్యాచరణ ప్రణాళికలతో సిద్దంగా ఉండాలన్నారు. ఒకటి, రెండు, మూడు ప్రమాద హెచ్చరికలకు అనుగుణంగా ముంపు బారిన పడే గ్రామాల్లో సహాయక చర్యలకు సర్వసన్నద్ధంగా ఉండాలని సూచించారు. ఆర్డబ్ల్యూఎస్, సిపిడబ్ల్యు స్కీముల వద్ద త్రాగునీటి సరఫరాకై విద్యుత్ సరఫరాకు ప్రత్యామ్నాయంగా జనరేటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కమ్యూనికేషన్ వ్యవస్థ ఉండే విధంగా మెలకువలు పాటించాలని పునరావాస కేంద్రాల్లో వసతులను కల్పించాలని, సహాయక చర్యలకు పడవలు, గజ ఈతగాళ్లు లైఫ్ జాకెట్లతో సహా సిద్దపరుచుకోవాలని చెప్పారు. నిత్యావసరాలు మూడు నెలల పాటు నిల్వ చేసుకోవాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలతో రాష్ట్ర విపత్తుల స్పందన దళం సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. ఇప్పటికే గోదావరికి వరదలు వస్తున్న నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని ఆమె స్పష్టం చేశారు. జిల్లా యంత్రాంగం మార్గదర్శకాలకు, సూచనలు, మ్యాపులు, హెచ్చరికలకు అనుగుణంగా విపత్తు నివారణ చర్యలను సమగ్రంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణరావు, తహసిల్దార్ నరసింహారావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం... రైతు ప్రభుత్వం

## - కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు

కొత్తపేట, జూలై 11, (తెలుగురాష్ట్రం విలేకరి)



ధాన్యం డబ్బులు జమ కాని రైతులకు ప్రభుత్వం ధాన్యం డబ్బులు విడుదల చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం రైతు ప్రభుత్వంగా నిరూపించుకుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ సీజన్లో అంచనాలకు మించి మూడురెట్లు అధికంగా ధాన్యం సేకరణ జరగటంతో చివరలో డబ్బులు చెల్లించటంలో కొంత మంది రైతులుకి ఇబ్బంది కలిగిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రతీ రైతుకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. జిల్లాలో రైతులుకు సంబంధించి రూ.188.86 కోట్లు ప్రభుత్వం విడుదల చేయడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే సీజన్ కు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గత ప్రభుత్వంలో కమీషన్ ఏజంట్ల ద్వారా అమ్మిన రైతులు బస్తాకు రూ.200 నష్టపోయేవారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ధాన్యం ఎవరికి ఎలా అమ్ముకున్నా సరే ప్రతీ రైతుకు రైతు సేవా కేంద్రం ద్వారా కొనుగోలు నమోదు చేయించి ఎగుమతి ఖర్చులు, వగైరా డెబ్బై, ఎనభై రూపాయలు తేడాతో మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. స్వంతంగా ధాన్యం తోలిన రైతులకు పూర్తిస్థాయిలో బస్తాకు రూ.1743 మద్దతు ధర లభించిందన్నారు.

# వకుళమాత అన్న ప్రసాద భవన నిర్మాణానికి విరాళాలు




ఆత్రేయపురం, జూలై 11, (తెలుగురాష్ట్రం విలేకరి)

కోనసీమ తిరుమల ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో చేపట్టిన వకుళమాత అన్న ప్రసాద భవన నిర్మాణానికి శుక్రవారం పలువురు దాతలు విరాళాలు అందజేసారు. ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామానికి చెందిన హనుమంతువర్జుల సూర్య వెంకట నరసింహ కుమార్, లక్ష్మీ ఫణికుమారి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.1,00,005, రావులపాలెం గ్రామానికి చెందిన కంకటాల సూర్యనారాయణ, భారతి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.1,00,000 విరాళంగా సమర్పించారు. స్వామి వారి దర్శనం అనంతరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో వారికి అర్చకులు, సిబ్బంది వేదాశీర్వచనం చేసి స్వామి వారి చిత్ర పటాలు అందజేసారు.

## తెలుగు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం



**పోలవరం, జూలై 11(తెలుగు రాష్ట్రం విలేకరి):** ఇంటర్ బోర్డు కమిషనర్ ఉత్తర్వులు, ఏలూరు జిల్లా డీవీఈవో ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న తెలుగు అధ్యాపకుల పోస్టును గెస్ట్ అధ్యాపకునిగా భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. సజిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాల నుండి ఎంఏ తెలుగులో కనీసం 50 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు కళాశాల కార్యాలయంలో తమ దరఖాస్తులను సమర్పించాలని ప్రిన్సిపాల్ కె. సజిని విజ్ఞప్తి చేశారు.

## ఎక్సయిజ్ శాఖ ద్విచక్ర వాహనాలకు వేలం



**జగ్గయ్యపేట, జూల్కై 11 (తెలుగురాష్ట్రం విలేకరి):** వివిధ కేసులలో పట్టుబడి ఎక్సైంజ్ శాఖ స్వాధీనం చేసుకున్న వాహనాల వేలం ప్రక్రియ శుక్రవారం రోజున కొనసాగింది. స్థానిక కేంద్ర ప్రొహిబిషన్ ఎక్సైంజ్ కార్యాలయంలో వేలం విధానంలో అమ్మకానికి పెట్టారు. వేలం ప్రక్రియ ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమై మధ్యాహ్నం వరకు కొనసాగింది. వివిధ రకాల ద్విచక్ర వాహనాలు, ఈ వేలంలో పాల్గొన్నాయి.వేలం ప్రక్రియలో పలువురు పాల్గొనగా ఆసక్తికరమైన పోటీ మధ్య కొన్ని వాహనాలు మార్కెట్ రేటుకంటే తక్కువ ధరకు విక్రయించబడ్డాయి. వేలం ద్వారా ప్రభుత్వ ఖజానాకు కొంతవరకు ఆదాయం సమకూరినట్లు ఎక్సైంజ్ శాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎక్సైంజ్ శాఖ అధికారులు అసిస్టెంట్ సూపర్వైజర్ విజయవాడ ఆర్.వి. రామ శివ, జగ్గయ్యపేట ఇన్స్పెక్టర్ బి. గురవయ్య మాట్లాడుతూ శాసనబద్ధంగా స్వాధీనం చేసుకున్న వాహనాలను పారదర్శక విధానంలో విక్రయించడమే లక్ష్యంగా వేలం నిర్వహించాం. తద్వారా పౌరులకి కూడా సరసమైన ధరకు వాహనాలు లభించినవి అని పేర్కొన్నారు. ఇలాంటి వేలాలను నిరంతరంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించామని, తద్వారా పౌరులకు, ప్రభుత్వానికి సమానంగా ప్రయోజనం చేకూరుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట ప్రొహబిషన్ ఎక్సైంజ్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సుబ్బలక్ష్మికి ఫ్రెండ్లీ క్లబ్ ఆధ్వర్యంలో ఘన సత్కారం



**కాత్రేనికోన, జూల్కై 11 (తెలుగురాష్ట్రం విలేకరి):** కాత్రేనికోన ఫ్రెండ్లీ క్లబ్ సభ్యురాలు, ఉన్నత విద్యావంతురాలు ఆణివిళ్ళ శ్రీవాణీ సుబ్బలక్ష్మికి, మచిలీపట్నం కృష్ణా యూనివర్సిటీ నందు తెలుగు సాహిత్యంలో విశ్రాంత ఆచార్య డా. ఆకొండి విశ్వనాథం వారి ముత్యాల శాల వచన కావ్యమునకు డా. జీ.బి. ఆనంద్ కుమార్ పర్యవేక్షణలో పరిశోధన, సమగ్ర పరిశీలనకు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కోన రాంజీ చేతుల మీదుగా డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అందుకున్న సందర్భంగా సుబ్బలక్ష్మిని ఫ్రెండ్లీ క్లబ్ వ్యవస్థాపకుడు ఆకొండి నాగ రవీంద్ర జోగయ్య శాస్త్రి, కాత్రేనికోన లో తేజస్విని జ్యోతిషాలయం వేదికగా ఘనంగా సత్కరించారు. ఈ సభకు విచ్చేసిన గౌరవ అధ్యక్షుడు తాతపూడి లక్ష్మీ నారాయణ మూర్తి, అధ్యక్షుడు గ్రంథి నానాజీ, సుంకర పవిత్ర కుమార్, మల్లాడి రాధాకృష్ణ, చల్లా గోపి, ఆకొండి ఉమ మహేష్ శర్మ, ఆకొండి సాయి కిరణ్, తాతపూడి కృష్ణ, సుంకర బుజ్జి, కోటపల్లి నరేంద్ర, డా.ఆణివిళ్ళ కాశ్యప్ ఆకొండి వేంకట సూర్య నారాయణ మూర్తి, ఆకొండి సూర్యకాంతం, ఆకొండి లీల తదితరులు ఆమెను అభినందించారు.

## ఖాళీస్థలాల యజమానులకు నోటీసులు.

### -బిజిల్లా కలెక్టర్ ప్రశాంతి.



**కోరుకొండ జూలై 11 (తెలుగురాష్ట్రం విలేకరి):** నగరాలు గ్రామాల్లో ఖాళీస్థలాల యజమానులు తమ స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి అన్నారు. నగరాలు, గ్రామాల్లో చాలా ప్రదేశాల్లో నివాసాల మధ్యలో ఏళ్ల తరబడి ఖాళీ స్థలాల అపరిశుభ్రంగా, పిచ్చిమొక్కలతో ప్రజలు తీవ్రఇక్కట్లు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో దోమలు, పందులు, వ్యాధికారక క్రిమికీటకాలు,పాములు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,ఇప్పటికే పలు ఫిర్యాదులు కూడా అందాయన్నారు. దీంతో నగరంలో స్వచ్ఛతను కాపాడేందుకు గ్రామ, వార్డు సచివాలయాల వారీగా కాళీస్థల యజమానులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల మధ్యలోని ఖాళీస్థలాల్లో కంపచెట్లతో అపరిశుభ్రంగా ఉంటే నోటీసులు జారీ చేస్తున్నట్లు వివరించారు. స్పందించని యజమానులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కనుక ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు.

### అంగన్వాడీ సెంటర్‌కు స్మార్ట్ టీవీ, ఇండక్షన్ స్టవ్, వంట పాత్రలను

## పంపిణీ చేసిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు







**ఉప్పలగుప్తం జూల్కై 11 (తెలుగురాష్ట్రం విలేకరి)** ఉప్పలగుప్తం మండలం, నంగవరం గ్రామంలోని అంగన్వాడీ సెంటర్ కు మంజూరు కాబడిన స్మార్ట్ టీవీ మరియు ఇండక్షన్ స్టవ్, వంట పాత్రలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ %ఓజ్ష% దేశంశెట్టి లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షులు అరిగేలా నానాజీ, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటల రామం, గుత్తుల నాగేశ్వరరావు, గుర్లింకి చిన్న, చీకట్ల ఏసుబాబు, మాజీ mpp బొర్రా ఈశ్వరరావు, ఆకుల వెంకటరమణ, ఇసుకపట్ల రఘుబాబు, రవణం మధు పెమ్మిరెడ్డి సత్యనారాయణ, చిక్కం ఉమేష్ మరియు తదితరులు పాల్గొన్నారు

## బిర్యానీ హెూటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారుల నిర్లక్ష్యం



**జగ్గయ్యపేట, జూల్కై 11 (తెలుగురాష్ట్రం విలేకరి):** పట్టణంలో పెరుగుతున్న బిర్యానీ హెూటళ్ల సంఖ్యతో పాటు వాటిలో పాటించాల్సిన ఆరోగ్య, భద్రతా ప్రమాణాలపై అధికారుల దృష్టి కన్పించక పోవడం ఆందోళనకరంగా మారింది. పలు ప్రాంతాల్లో హెూటళ్లలో శుభ్రత లేకపోవడం, పాత పదార్థాలు వాడటం, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే సింథటిక్ రంగులను బిరియానీలల్లో వాడడం నియమ నిబంధనలు లేకపోవడం వంటి ఆరోపణలు వెల్లు వెత్తుతున్నప్పటికీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు పట్టించు కోకపోవడం విశేషంగా మారింది. రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి పదంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంకిత భావంతో పనిచేస్తుండగా ఆయన సంకల్పానికి అనుగుణంగా స్థానిక నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య అహర్నిశలు శ్రమిస్తున్నారు. కొందరు అధికారులు మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా ప్రజల ప్రాణాలను గాలికి వదిలేసారు అన్నట్టుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు జరగక పోవడంతో కొన్ని హెూటళ్ల యజమానులు మిగిలిపోయిన బిర్యానిని డీ ఫ్రిజ్లో పెట్టి మరుసటి రోజుకు దాన్ని మరల ఆ యొక్క ఆహారాన్ని వేడి చేసి ప్రజలకు దాన్నే అందిస్తున్నారు. దానివల్ల కూడా క్యాన్సర్ తో పాటు అనేక రోగాలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆరోగ్యానికి హానికరమైన విధంగా హెూటల్ యజమానులు ఆహార పదార్థాలను అందించడంలో నిర్భయంగా వ్యవహరిస్తున్నారు. స్థానిక ప్రజల అభిప్రాయం ప్రకారం, కొంతమంది అధికారులు అక్రమార్జనే ధ్యేయంగా మౌనంగా ఉన్నారని ఆరోపణలు వస్తున్నాయి. తనిఖీలకు ముందు హెూటల్ యజమానులకు సమాచారం ఇచ్చి కవరింగ్ ఇస్తున్నారనే అనుమానాలు కూడా ఉన్నాయి. ఇలాంటి వార్తలు వచ్చినప్పుడు చిన్నచిన్న, హెూటళ్ల పై పడి తూతూ మంత్రంగా ఫైన్లు వేస్తున్నారు తప్ప, బడా హెూటల్లో జోలికి వెళ్లడం లేదని కూడా ప్రజలు నుండి పలు ఆరోపణలు వస్తున్నాయి. కల్తీ ఆహారంపై శాశ్వతమైన చర్యలను, సలహాలను, సూచనలను హెూటల్ యజమానులకు అధికారులు ఇవ్వడం లేదని ఇది ప్రజల ఆరోగ్యాన్ని ఉద్ధరించకుండా కొన్ని లాభదాయక ఒప్పందాలకు దారితీస్తోంది అని కొంతమంది సామాజిక ప్రజలు అభిప్రాయపడ్డారు. ఫుడ్ సేఫ్టీ శాఖ తక్షణమే రంగంలోకి దిగకపోతే, ఎన్నో రకాల అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.నియోజకవర్గంలోని మూడు మండలాల్లోని బిరియాని హెూటళ్లపై స్పెషల్ డ్రైవ్ లను చేపట్టాలి. నిల్వ ఉంచిన మాంసాన్ని, ఆహార పదార్థాలను ఆరోగ్యానికి హాని కలిగించే సింథటిక్ ఫుడ్ కలర్ ను పరిశుభ్రత నిబంధనల ఉల్లంఘన పై కఠిన చర్యలు తీసుకోవాలని, ఫుడ్ సేఫ్టీ అధికారుల పనితీరుపై సమీక్ష జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ప్రజలతో, అధికారులు సంయుక్త సమీక్ష సమావేశాలు నిర్వహించాలని ప్రజలు కోరుకుంటున్నారు.అదే విధంగా అధికారుల నిర్లక్ష్యంపై తగిన చర్యలు తీసుకుని, హెూటళ్లను ఆరోగ్య ప్రమాణాల మేరకు నడిపించేందుకు కఠిన నిబంధనలు అమలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

## వీరవాసరంలో తిరువన్నామలై ఎక్స్ ప్రెస్ హాల్ట్ .. కేంద్రమంత్రి వర్మ



**భీమవరం జూలై 11, (తెలుగురాష్ట్రం విలేకరి):** నరసాపురం నుంచి తిరువన్నామలై (అరుణాచలం) వీక్లి ఎక్స్ ప్రెస్ ఇక నుంచి వీరవాసరంలో కూడా హాల్ట్ ఉంటుందని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2 నిమిషాల హాల్ట్ కు దక్షిణ మధ్య రైల్వే ఆమోదం తెలిపిందని అయన తెలిపారు. ఈనెల 9న ప్రారంభమైన అరుణాచలం వీక్లి ఎక్స్ ప్రెస్ లో తాను ప్రయాణించినప్పుడు వీరవాసరం లో కూడా హాల్ట్ ఇవ్వాలని స్థానిక ప్రజలు కోరడం జరిగిందన్నారు. దీనిపై దక్షిణ మధ్య రైల్వే అధికారులను సంప్రదించగా వారు 2 నిమిషాల హాల్ట్ కు ఆమోదం తెలిపారని అన్నారు.


## బాలత్రిపుర సుందరికి 250 గ్రాముల వెండి అందజేత



**భీమవరం జూలై 11, (తెలుగురాష్ట్రం విలేకరి):** భీమవరం మెంటేవారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారి వెండి మకర పీఠానికి శుక్రవారం దాతలు 250 గ్రాముల వెండిని విరాళాలు అందించారు. పట్టణానికి చెందిన పట్నాల బ్రహ్మాజీ, గంగాభవాని దంపతులు 250 గ్రాముల వెండి విరాళాన్ని ఆలయ ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ దాతలకు పూజలు చేసి అమ్మవారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజలకు చాటి చెబుదాం

### -సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల



**రాజోలు, జులై 11(తెలుగురాష్ట్రం విలేకరి):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో సాధించిన విజయాలను ప్రజలకు చాటి చెబుదామని శాసనమండలి సభ్యులు పేరాబత్తుల రాజశేఖర్ పిలుపునిచ్చారు. రాజోలు మండలంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శుక్రవారం నాడు ఎమ్మెల్సీ రాజశేఖర్ ప్రారంభించారు. రాజోలు వాసవి కల్యాణ మండపంలో మండల పరిధిలోని బూత్ కన్వీనర్లకు శిక్షణ కార్యక్రమం అనంతరం రాజోలు పట్టణంలో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వ పథకాలను వివరించారు. పెన్షన్ సక్రమంగా అందుతుందా.. ఉచిత గ్యాస్ సిలిండర్లు వస్తున్నాయా.. తల్లికి వందనం అందిందా.. అంటూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం విధ్వంసం పాలయ్యిందని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఈ ఏడాదిలో తిరిగి వికాసం వైపు పయనిస్తున్నామని ఎమ్మెల్సీ రాజశేఖర్ తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే వృద్ధులకు పెన్షన్ రూ. 3 వేల నుండి రూ. 4 వేలకు పెంచారని తెలిపారు. తల్లికి వందనం క్రింద ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ. 15 వేలు అందించామని చెప్పారు. మహిళలకు దీపం -2 పథకం వెంటనే అమలు చేశామని చెప్పారు. త్వరలో అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తామని తెలిపారు. ఆగస్ట్ 15 నుండి మహిళలకు ఉచిత బస్ పథకం అమలులోకి వస్తుందని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాల అమలుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గోదావరి డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, తెలుగుదేశం మీడియా కోఆర్డినేటర్ బోళ్ళ సతీష్ బాబు, టిడిపి నియోజకవర్గ మాజీ ఇంచార్జి బత్తుల రాము, టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ళ వెంకటరమణ, రాజోలు పట్టణ టీడీపి అధ్యక్షులు పామర్తి రమణ, కార్యదర్శి నార్కెడమిల్లి విష్ణు, మామిడికుదురు మండల టిడిపి అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, టీడీపి నాయకులు చాగంటి స్వామి, మోకా పార్వతి, రావి మురళి, సత్తిరాజు స్వామి, బోళ్ళ రాజేష్, పెసింగి ఏసుబాబు, షేక్ ఇస్మాయిల్, మట్టపర్తి లక్ష్మి, చెల్లింగి జాంబవతి, ఆరుమిల్లి సాయిబాబు, బూత్ ఇంచార్జి భద్రం తదితరులు పాల్గొన్నారు.

https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

## టిడిపి క్లస్టర్ ఇంచార్జి పడాల పండుని ఘనంగా సత్కరించిన పీఠం దత్త నరసింహారాజు



**కోరుకొండ, జూలై 11(తెలుగు రాష్ట్రం విలేఖరి):** గాడాల తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ గా నియమితులైన పడాల వీర వెంకట సత్యనారాయణ (పండు)ని పీఠం ఉత్తరాధికారి శ్రీమాన్ దత్తత నరసింహారాజు పూలబోకెలు అందించి, సాల్వాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో పడాల పండు మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని కోరుతున్నామని తెలిపారు.రాజానగరం తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్చార్జిగా నియమితులైన సీనియర్ నాయకులు పడాల వీర వెంకట సత్యనారాయణ శుక్రవారం గాడాలలో వేంచేసి ఉన్న శ్రీ మహాలక్ష్మీ సమేత చిన్న వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారని, ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు శ్రీమాన్ డాక్టర్ చిన్న వెంకన్నబాబు స్వామీజీ పడాల వీర వెంకట సత్యనారాయణ పేరున ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులతో ఆయన మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆశీర్వదించారు. గత 15 సంవత్సరాలుగా గాడాల గ్రామ టీడీపీ అధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వహిస్తున్న పడాల వీర వెంకట సత్యనారాయణ, శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి భక్తులని, ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటినుంచి ఆయన తండ్రి పడాల నారాయణమూర్తి, సోదరుడు పడాల చిట్టిబాబు టీడీపీలోనే కొనసాగుతున్నారని, పడాల వీర వెంకట సత్యనారాయణ కూడా తండ్రి సోదరుల బాటలోనే నడిచి టీడిపి అధికారంలో ఉన్నా లేకపోయినా ఆ పార్టీలోనే కొనసాగుతూ గత 30 సంవత్సరాలుగా గాడాల గ్రామ టీడీపీలో కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. రాజానగరం నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జిగా, రుడా చైర్మన్ గా నియమితులైన బొడ్డు వెంకటరమణ చౌదరికి నమ్మకమైన అనుయాయుడిగా పడాల వీర వెంకట సత్యనారాయణ పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్నారన్నారు. ఆయన రాజానగరం టీడీపీ క్లస్టర్ ఇన్చార్జిగా నియమితులవడంతో అమ్మవారి దర్శనానికి వచ్చి పీఠము ఉత్తరాధికారి శ్రీమాన్ దత్త నరసింహారాజు సమక్షంలో పూజలు నిర్వహించి ఆశీస్సులు అందుకున్నారు. పూజా కార్యక్రమంలో గాడాల జనసేన నాయకులు అడ్డాల శివ, టిడిపి సీనియర్ నాయకులు మట్టా పెద్ద, మాదారపు శ్రీనివాసు, బయ్యవరపు వెంకటేశ్వరరావు, చాటపర్తి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రయివేట్ ల్యాబ్‌లకు కొమ్ము కాస్తున్న వైద్యులు

**చీరాల, జులై 11(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** వేటపాలెం మండలంలోని రక్త పరీక్షా కేంద్రాలకు (ల్యాబ్స్) నిబంధనలు అమలు కాని పరిస్థితి నెలకొంది. ఆరోగ్యశాఖ అధికారులు పర్యవేక్షణ కొరవడడంతో ల్యాబ్ యాజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారంటూ జనం గగ్గోలు పెడుతున్నారు. ప్రజల రోగనిర్ధారణలో అత్యంత కీలకంగా ఉన్న రక్త పరీక్షా కేంద్రాల విషయంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల కేంద్రం లో 10 రక్త పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. ప్రకాశంలోనూ దాదాపు అదే విధంగా ఉన్నాయి. రెండు జిల్లాల్లోనూ రక్తపరీక్షా కేంద్రాలపై సరైన పర్యవేక్షణ లేకుండా పోయిందని చెప్పొచ్చు. జ్వరం నుంచి శరీరంలో ఏసమస్య వచ్చినా రక్తపరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించిన తర్వాతే డాక్టర్లు వైద్యం అందిస్తారు. రక్త పరీక్షా కేంద్రాల ఏర్పాటు, వాటి అమలుపై అనేక నిబంధనలు ఉన్నాయి. ఆరోగ్యశాఖ విధించిన నిబంధనలను రక్తపరీక్షా కేంద్రాల నిర్వాహకులు పట్టించుకోని పరిస్థితి కొనసాగుతోంది. నిబంధనల ప్రకారం ప్రతి రక్త పరీక్షా కేంద్రం వద్దా ఏ టెస్ట్‌కు ఎంత ఫీజు అనేది పట్టిక రూపంలో ఏర్పాటు చేయాలి. దాని ప్రకారమే రోగుల నుంచి వసూలు చేయాలి. చీరాల పట్టణంతోపాటు, ఏ ఒక్క రక్త పరీక్షా కేంద్రం వద్ద ధరల పట్టిక లేదంటే అతిశయోక్తికాదు. ధరల పట్టికపై రోగులు అడిగినా సమాధానం చెప్పని పరిస్థితి నెలకొంది. దీంతో రక్త పరీక్షలకు ఇష్టానుసారం ధరలు వసూలు చేస్తున్నారు. ఒకే పరీక్షకు ఒక ల్యాబ్‌లో ఒక ధర, మరో ల్యాబ్‌లో ఇంకో ధర ఉంటుంది. సుగర్ నిర్ధారణ టెస్ట్‌కు ఒకచోట రూ.50 తీసుకుంటే, మరో ల్యాబ్‌లో రూ.వంద, ఇంకో ల్యాబ్‌లో ఇంకోవిధంగా వసూలు చేస్తున్నారు.



విటమిన్ డి, బి-12 వంటి పరీక్షలకు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. డెంగీ నిర్ధారణ పరీక్ష ప్రయివేటు ల్యాబ్‌లో చేసే అవకాశం లేదు. కానీ చాలా ల్యాబ్‌ల్లో స్థానిక వైద్యులతో కుమ్మక్కై డెంగీ ఉందంటూ రోగులను భయపెడుతున్న పరిస్థితులు సైతం కొనసాగుతున్నాయి. పలు ఆసుపత్రులతో రక్తపరీక్షా కేంద్రాల నిర్వాహకులు ఏకమవుతున్నారు. ప్రతి పరీక్షకూ ఆయా ఆసుపత్రులకు పర్సంటేజ్‌ల రూపంలో కమీషన్‌లు ల్యాబ్ నిర్వాహకులు ఇస్తుంటారు. ఈ కమీషన్ 60 నుంచి 70 శాతం వరకూ ఉంటుందని తెలుస్తోంది. దీంతో రోగుల నుంచి భారీగా దోపిడీ చేస్తున్న పరిస్థితి నెలకొంది. రక్త పరీక్షలకు సంబంధించిన ధరల నిర్ణయంపై జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు అసలు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. దీంతో ల్యాబ్ నిర్వాహకులు ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లుగా తయారవుతోంది. రక్త పరీక్షా కేంద్రాల్లో పాటించాల్సిన నిబంధనలు సరిగ్గా అమలుకాకపోవడంతో రోగులు భారీ దోపిడీకి గురికావడంతోపాటు, అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొరవడిన అధికారుల పర్యవేక్షణ..రక్తపరీక్షా కేంద్రాలను ఆరోగ్యశాఖ అధికారులు ప్రతి మూడు నెలలకు ఒకసారి తనిఖీలు చేయాలి. అసలు తనిఖీలు జరుగుతున్నాయా అన్న అనుమానాలు నెలకొన్నాయి. ఏదైనా సమస్య బయటపడినప్పుడు మాత్రం హడావుడీ చేయడం, తర్వాత వదిలేయడం ఆరోగ్యశాఖ అధికారులకు పరిపాటిగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ప్రతి ఐదేళ్లకోసారీ రిజిష్టర్ అయిన రక్తపరీక్షా కేంద్రాలకు సంబంధించి రెన్యువల్ చేయించుకోవాలి. నిబంధనలు ఎవరూ పాటించడం లేదు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న రక్తపరీక్షా కేంద్రాలు చాలా ఉన్నట్లు జనాల్లో చర్చ సాగుతోంది. ఒకపేరు మీద పరీక్షా కేంద్రం రిజిష్టర్ చేస్తూ మరొకరు నిర్వహిస్తున్న పరిస్థితులు సైతం ఉన్నట్లు విమర్శలు ఉన్నాయి. రక్తపరీక్షా కేంద్రాల నిర్వాహకులతో ఆరోగ్యశాఖలోని అధికారులు కుమ్మక్కై పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రక్తపరీక్షా కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది అర్హతలపై అనేక అనుమానాలు నెలకొన్నాయి. రక్త పరీక్షలు చేయాలంటే ఎంఎల్‌టికి సంబంధించిన డిప్లమో, బిఎస్‌పి ల్యాబ్ టెక్నీషియన్ వంటి కోర్సులు చదివిన వారు ఉండాలి. చాలా రక్త పరీక్షా కేంద్రాల్లో అర్హత లేనివారిని తక్కువ జీతాలకు నియమిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల కనీస పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. అధికారుల తనిఖీలు లేకపోవడంతో ధరల పట్టిక నుంచి, సిబ్బంది నియామకం వరకూ రక్తపరీక్షా కేంద్రాల నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు రక్తపరీక్షా కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించకపోతే రోగులు మరిన్ని ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

## కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజలకు చాటి చెబుదాం

### -సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల





**రాజోలు, జులై 11 (తెలుగురాష్ట్రం విలేకరి):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో సాధించిన విజయాలను ప్రజలకు చాటి చెబుదామని శాసనమండలి సభ్యులు పేరాబత్తుల రాజశేఖర్ పిలుపునిచ్చారు. రాజోలు మండలంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శుక్రవారం నాడు ఎమ్మెల్సీ రాజశేఖర్ ప్రారంభించారు. రాజోలు వాసవి కల్యాణ మండపంలో మండల పరిధిలోని బూత్ కన్వీనర్లకు శిక్షణ కార్యక్రమం అనంతరం రాజోలు పట్టణంలో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వ పథకాలను వివరించారు. పెన్షన్ సక్రమంగా అందుతుందా.. ఉచిత గ్యాస్ సిలిండర్లు వస్తున్నాయా.. తల్లికి వందనం అందిందా.. అంటూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం విధ్వంసం పాలయ్యిందని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఈ ఏడాదిలో తిరిగి వికాసం వైపు పయనిస్తున్నామని ఎమ్మెల్సీ రాజశేఖర్ తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే వృద్ధులకు పెన్షన్ రూ. 3 వేల నుండి రూ. 4 వేలకు పెంచారని తెలిపారు. తల్లికి వందనం క్రింద ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ. 15 వేలు అందించామని చెప్పారు. మహిళలకు దీపం -2 పథకం వెంటనే అమలు చేశామని చెప్పారు. త్వరలో అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తామని తెలిపారు. ఆగస్ట్ 15 నుండి మహిళలకు ఉచిత బస్ పథకం అమలులోకి వస్తుందని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాల అమలుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గోదావరి డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, తెలుగుదేశం మీడియా కోఆర్డినేటర్ బోళ్ళ సతీష్ బాబు, టిడిపి నియోజకవర్గ మాజీ ఇంచార్జి బత్తుల రాము, టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ళ వెంకటరమణ, రాజోలు పట్టణ టీడీపీ అధ్యక్షులు పామర్తి రమణ, కార్యదర్శి నార్కెడమిల్లి విష్ణు, మామిడికుదురు మండల టిడిపి అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, టీడీపి నాయకులు చాగంటి స్వామి, మోకా పార్వతి, రావి మురళి, సత్తిరాజు స్వామి, బోళ్ళ రాజేష్, పెసింగి ఏసుబాబు, షేక్ ఇస్మాయిల్, మట్టపర్తి లక్ష్మి, చెల్లింగి జాంబవతి, ఆరుమిల్లి సాయిబాబు, బూత్ ఇంచార్జి భద్రం తదితరులు పాల్గొన్నారు.






## ఆటో యూనియన్ సభ్యులతో ఎస్ఐ సమావేశం



**పోలవరం, జూలై 11 (తెలుగు రాష్ట్రం విలేకరి):** శ్రీ చైతన్య ఆటో యూనియన్ సభ్యులతో పోలవరం ఎస్సై పవన్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఆటో యూనియన్‌కు చెందిన డ్రైవర్లందరితో ప్రత్యేకంగా మాట్లాడిన ఎస్సై ప్రతి ఆటో డ్రైవర్ లైసెన్స్ వాహన ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని అటువంటి చర్యలు చట్టరీత్యా శిక్షార్హమని హెచ్చరించారు. రాత్రి సమయంలో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు లేదా ఆటోల ద్వారా మత్తు పదార్థాలు (సారా గంజాయి) రవాణా చేయడాన్ని తాము గమనిస్తే కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. అటువంటి చర్యల గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజల భద్రత కోసం డ్రైవర్ల సహకారం ఎంతో అవసరమని ఎస్సై పవన్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో ప్రెసిడెంట్ తాళ్లపూడి చంద్రరావు, కోశాధికారి కొత్తపల్లి నాగరాజు, ఆటో యూనియన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## శాకాంబరీ అలంకారంలో విజయ కనకదుర్గ అమ్మవారు

**పోలవరం, జులై 11(తెలుగు రాష్ట్రం విలేకరి):**



గూటాల గ్రామంలో అఖండ గోదావరి నదీ తీరాన భక్తులకు ఆశ్రయదాయినిగా వెలిశిన శ్రీ విజయ కనకదుర్గ దేవి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శాకాంబరీ దేవిగా భక్తులు వైభవంగా అలంకరించారు.అమ్మవారికి ఆషాఢ మాస సారెగా గ్రామస్తులు చీరలు గాజులు, పసుపు కుంకుమ, స్వీట్లు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు భక్తిశ్రద్ధలతో సామూహిక లలితా సహస్ర నామ పారాయణ నిర్వహించారు. స్థానికులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

## మండల టిడిపి అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వాలి

### -ఎమ్మెల్యేను కోరిన బిసి నేతలు



**చింతలపూడి, జులై 11 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్ ను శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లింగపాలెం మండల బీసీ నాయకులు కలిశారు. లింగపాలెం మండలంలోని 22 గ్రామపంచాయతీలుకు గాను 10 గ్రామ పార్టీ అధ్యక్షులు బీసీలకు ఇవ్వాలని అలాగే లింగపాలెం మండల పార్టీ అధ్యక్షులు బీసీలకు ఇవ్వాలని ఎమ్మెల్యేని కోరారు. ఈ కార్యక్రమంలో లింగపాలెం మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చెన్ను శ్రీనివాస్ యాదవ్, జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి పిల్లల శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు పామర్తి వెంకటేశ్వరరావు, చలమాల నాగేశ్వరరావు, చిన్నిలు, నాయుడు మహేష్, పామర్తి సత్యనారాయణ, నందిగాం సుబ్బారావు, గజ్జ వెంకటేశ్వరరావు తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

## ఇంగ్లాండ్ టూర్ కు ఎంపికైన యువ క్రికెటర్ రాజేష్



**జగ్గయ్యపేట, జూల్కై 11 (తెలుగురాష్ట్రం విలేకరి):** నియోజకవర్గానికి గర్వకారణంగా, ఇంగ్లాండ్ టూర్‌కు ఎంపికైన యువ క్రికెటర్ రాజేష్‌ను అభినందిస్తూ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య కుమారుడు శ్రీరాం కృష్ణ పవన్ వారి నివాసంలో ప్రత్యేకంగా రూ.10,000 ప్రోత్సాహకాన్ని అందజేశారు. క్రీడల ప్రోత్సాహం ద్వారా యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందుతోందని, ఈ ప్రాంతం నుండి మరింత మంది ఆటగాళ్లు అంతర్జాతీయ స్థాయికి చేరాలని ఆయన ఆకాంక్షించారు. జగ్గయ్యపేట నుంచి పుట్టిన ఈ క్రీడాకారుడు ఇంగ్లాండ్‌లో భారత గర్వాన్ని నిలబెట్టాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. ప్రతిభ ఉన్న ప్రతి యువకుడికి మేము తోడుగా ఉంటాం అని కృష్ణ పవన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక క్రీడాభిమానులు, యువత, కోచ్‌లు కృష్ణ పవన్ అభినందిస్తూ ఆయన చేసిన సాయం ఎంతో ప్రేరణాత్మకమని పేర్కొన్నారు.

# టీమిండియాలోకి వైభవ్ నోఎంట్రీ..

## వైల్డ్ కార్డు ఇచ్చినా వేస్టే..

**ఇంగ్లాండ్ అండర్-19తో జరిగిన యూత్ వన్డే సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ సంచలనం సృష్టించాడు. మొత్తం మూడు వన్డేలలో 355 పరుగులు చేసి భారత్ తరపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఇంతటి అద్భుతమైన ప్రదర్శన చేసినప్పటికీ, వైభవ్ టీమిండియా తరపున అరంగేట్రం చేయడం కష్టమే..**



భారత క్రికెట్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ.. ఇంగ్లాండ్‌తో జరిగిన యూత్ వన్డే క్రికెట్‌లో పేలుడు బ్యాటింగ్‌తో విధ్వంసం సృష్టించాడు. ఆతిథ్య ఇంగ్లాండ్ అండర్-19తో జరిగిన ఈ సిరీస్‌లో వైభవ్ 5 మ్యాచ్‌ల్లో 355 పరుగులు చేశాడు. ఇందులో 29 సిక్సర్లు, 30 ఫోర్లు ఉన్నాయి. ఇంతటి పేలుడు బ్యాటింగ్ చేసినప్పటికీ, వైభవ్ సూర్యవంశీకి ప్రస్తుతం టీమిండియాలో చోటు దక్కడం కష్టమే.

వైభవ్ సూర్యవంశీ.. భారత సీనియర్ జట్టుకు ఎంపిక కావడానికి మరో ఏడాది వేచి చూడాల్సి ఉంటుంది. దీనికి ప్రధాన కారణం ఐసీసీ కొత్త నియమం. వైభవ్ సూర్యవంశీకి ఇప్పుడు 14 సంవత్సరాలు. ఐసీసీ నిబంధనల ప్రకారం, జాతీయ జట్టుకు ఆడే ఆటగాడికి కనీసం 15 సంవత్సరాలు నిండాలి.

2020లో, ఐసీసీ అంతర్జాతీయ క్రికెట్ కోసం కనీస వయస్సు నియమాన్ని రూపొందించింది. దీని ప్రకారమే జాతీయ ఆటగాళ్ళను ఎంపిక చేస్తారు. వైభవ్ సూర్యవంశీ ప్రస్తుత వయస్సు 14 సంవత్సరాలు. అంటే వచ్చే ఏడాది మార్చి 27 నాటికి అతనికి 15 సంవత్సరాలు నిండుతాయి. అప్పుడే అతను జాతీయ జట్టుకు అర్హత సాధిస్తాడు.

గతంలో అంతర్జాతీయ క్రికెట్ ఆడటానికి కనీస వయోపరిమితి ఉండేది కాదు. దీని కారణంగా, పాకిస్తాన్‌కు చెందిన హసన్ రాజా కేవలం 14 సంవత్సరాల 227 రోజుల వయసులో అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. ప్రస్తుత పరిస్థితిలో, వైభవ్ సూర్యవంశీ ఈ ప్రపంచ రికార్డును బద్దలు కొట్టడం కష్టం.

అందువల్ల, వైభవ్ సూర్యవంశీ వచ్చే ఏడాది జరగనున్న %ు%20 ప్రపంచ కప్‌కు అర్హత పొందలేడు. అయితే, %దీజజ×% అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్‌కు ప్రత్యేక అభ్యర్థన చేస్తే, ఆ యువ ఆటగాడికి %×జజ% పరీక్ష పెడుతుంది. ఆ పరీక్షలో ఉత్తీర్ణుడైతేనే, %×జజ% అనుమతి ఇస్తుంది. కానీ ప్రస్తుతం భారత టీ20 జట్టులో చోటు కోసం భారీ సంఖ్యలో ఆటగాళ్లు ఎదురుచూస్తున్నారు. అందువల్ల, బీసీసీఐ అలాంటి అభ్యర్థన చేసే అవకాశం లేదు. దీని కారణంగా, వైభవ్ సూర్యవంశీ భారతదేశం తరపున అంతర్జాతీయంగా అరంగేట్రం చేయడానికి కనీసం ఒక సంవత్సరం వేచి ఉండాల్సి ఉంటుంది.

# 5 వరుస బంతుల్లో 5 వికెట్లు..

## క్రికెట్ హిస్టరీలోనే తొలి బౌలర్‌గా రికార్డ్

**ఐర్లాండ్ ఫాస్ట్ బౌలర్ కర్టిస్ కాంపర్ అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు. 5 బంతుల్లో 5 వికెట్లు పడగొట్టడం ద్వారా అద్భుతాలు చేశాడు. అతను టీ20 క్రికెట్‌లో చరిత్ర సృష్టించాడు. ఈ ఫార్మాట్ చరిత్రలో ఒక బౌలర్ ఇలా చేయడం ఇదే మొదటిసారి. డబ్లిన్‌లోని శాండీమౌంట్‌లోని పెంబ్రోక్ క్రికెట్ క్లబ్‌లో క్రికెట్ ఐర్లాండ్ ఇంటర్-ప్రావిన్షియల్ %ు%20 ట్రోఫీ మ్యాచ్‌లో మున్‌స్టర్ రెడ్స్ వర్సెస్ నార్త్ వెస్ట్ వారియర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఐదు బంతుల్లో ఐదు వికెట్లు పడగొట్టి కాంపర్ చరిత్ర సృష్టించాడు.**





ఈ మ్యాచ్‌లో కాంపర్ మున్స్టర్ రెడ్స్ తరపున ఆడుతున్నాడు. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేయాలని జట్టు నిర్ణయించుకుంది. మున్స్టర్ రెడ్స్ 188 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. కాంపర్ 24 బంతుల్లో 44 పరుగులు చేసి జట్టులో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 26 ఏళ్ల కాంపర్ తన జట్టుకు కెప్టెన్ కూడా. బ్యాటింగ్‌లో సంచలనం సృష్టించిన తర్వాత, బౌలింగ్‌లో అద్భుతాలు చేశాడు. "నన్ను అలా చేయమని షమీ బలవంతం చేశాడు.."

ఈ మ్యాచ్‌లో కాంపర్ మున్స్టర్ రెడ్స్ తరపున ఆడుతున్నాడు. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేయాలని జట్టు నిర్ణయించుకుంది. మున్స్టర్ రెడ్స్ 188 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. కాంపర్ 24 బంతుల్లో 44 పరుగులు చేసి జట్టులో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 26 ఏళ్ల కాంపర్ తన జట్టుకు కెప్టెన్ కూడా. బ్యాటింగ్‌లో సంచలనం సృష్టించిన తర్వాత, బౌలింగ్‌లో అద్భుతాలు చేశాడు.

క్యాంఫర్ చరిత్ర పుస్తకాలలో తన పేరును లిఖించుకున్నాడు. పురుషుల టీ20 క్రికెట్‌లో ఏ స్థాయిలోనైనా ఒక బౌలర్ 5 బంతుల్లో ఐదు వికెట్లు పడగొట్టడం ఇదే మొదటిసారి. అతి తక్కువ ఫార్మాట్‌లో అంతర్జాతీయ, దేశీయ లేదా ఫ్రాంచైజ్ లీగ్ గేమ్‌లో ఇది ఇంతకు ముందు ఎప్పుడూ జరగలేదు. క్యాంఫర్ 2.2 ఓవర్లలో 16 పరుగులకు 5 వికెట్లు పడగొట్టాడు. అతనికి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. %ు%20 మ్యాచ్‌లో నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు తీసిన ఆరుగురు బౌలర్లలో క్యాంఫర్ ఒకరు. 2021లో అబుదాబిలో నెదర్లాండ్స్‌తో జరిగిన 2021 %ు%20 ప్రపంచ కప్ మ్యాచ్‌లో అతను ఈ ఘనతను సాధించాడు.

# అంగుళం తేడాతో చావు నుంచి లేడీ ఫ్యాన్ ఎస్కేప్..



**వైటాలిటీ బ్లాస్ట్ టీ20 లీగ్ సందర్భంగా, మ్యాచ్ చూడటానికి వచ్చిన ఒక అమ్మాయి తృటిలో చావు నుంచి తప్పించుకుంది. ఒక బ్యాట్స్‌మన్ కొట్టిన బంతి ఆమెకు బలంగా తగిలింది. దాని కారణంగా ఆమె నొప్పితో కేకలు వేసింది. బంతి ఆమె ముఖానికి లేదా తలకు తగలకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమీపంలో కూర్చున్న వ్యక్తులు అమ్మాయి పరిస్థితి గురించి ఆరా తీశారు. కెంట్, సస్సెక్స్ మధ్య జరిగిన మ్యాచ్ సందర్భంగా ఈ సంఘటన చోటు చేసుకుంది. కెంట్ ఇన్నింగ్స్ సమయంలో ఓ బ్యాటర్ సిక్స్ కొట్టాడు. అది మ్యాచ్ చూడటానికి వచ్చిన అమ్మాయి చేతికి నేరుగా తగిలింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.**

### ప్రమాదం ఎలా జరిగింది?

ఈ సంఘటన కెంట్ ఇన్నింగ్స్ నాల్గవ ఓవర్లో జరిగింది. సస్సెక్స్ తరపున ఓల్లీ రాబిన్సన్ నాల్గవ ఓవర్ వేశాడు. ఈ ఓవర్ రెండవ బంతికి, కెంట్ ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ డేనియల్ బెల్ డ్రమ్మండ్ భారీ సిక్స్ కొట్టాడు. ఆ బంతి నేరుగా మ్యాచ్ చూడటానికి వచ్చిన గ్యాలరీలో కూర్చున్న ఒక అమ్మాయి చేతిని తాకింది. దీంతో ఆమె నొప్పితో కేకలు వేసింది. చుట్టుపక్కల వారు ఆ అమ్మాయి పరిస్థితి గురించి అడిగినప్పుడు, ఆమె అంతా బాగానే ఉందని సంజ్ఞ చేసింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కెంట్ ఈ మ్యాచ్‌లో రెండు వికెట్ల తేడాతో గెలిచింది.

### మ్యాచ్ ఎలా ఉంది?

వైటాలిటీ బ్లాస్ట్ టీ20 లీగ్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన సస్సెక్స్ జట్టు మొత్తం 20 ఓవర్లలో 148 పరుగులు చేసింది. టామ్ క్లార్క్ 20 బంతుల్లో అత్యధికంగా 29 పరుగులు చేశాడు. ఇది కాకుండా, ఆలీ రాబిన్సన్ 14 బంతుల్లో 27 పరుగులు త్వరగా చేశాడు. జేమ్స్ క్లోజ్ 14 బంతుల్లో 24 పరుగులు చేశాడు. కెంట్ తరపున నాథన్ గిల్‌క్రిస్ట్ 3.5 ఓవర్లలో 42 పరుగులకు నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఫ్రెడ్ క్లాసెన్ రెండు వికెట్లు పడగొట్టాడు. లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కెంట్ జట్టు 19.3 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి విజయ లక్ష్యాన్ని చేరుకుంది. కెంట్ తరపున జోయ్ ఎవిసన్ 24 బంతుల్లో అత్యధికంగా 48 పరుగులు చేశాడు. ఓపెనర్ డేనియల్ బెల్ డ్రమ్మండ్ 36 బంతుల్లో 47 పరుగులు చేశాడు. ససెక్స్ తరపున ట్రైమల్ మిల్స్ 3.3 ఓవర్లలో 22 పరుగులకు మూడు వికెట్లు పడగొట్టాడు.

# నితీశ్ విషయంలో ఆ ఆలోచనే వద్దు: మేనేజ్‌మెంట్‌కు కుంబ్లే సూచన

ఇంగ్లాండ్‌తో లార్డ్స్ టెస్టులో తొలి రోజు భారత్ తరపున తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి హీరో అనడంలో సందేహమే లేదు. బుమ్రా, సిరాజ్, ఆకాశ్ దీప్ ఎంత ప్రయత్నించినా ఆరంభంలో వికెట్ తీయలేకపోయారు. కానీ, వచ్చీ రావడంతోనే ఒకే ఓవర్‌లో నితీశ్ ఇంగ్లాండ్ ఓపెనర్లను వెనక్కి పంపాడు. ఆ తర్వాత ఆతిథ్య జట్టు ఇన్నింగ్స్ నెమ్మదిగా నడిచింది. రూట్, బెన్ స్టోక్స్ వంటి టాప్ బ్యాటర్లను కూడా నితీశ్ తన బౌలింగ్‌తో ఇబ్బందిపెట్టాడు. గత ఆస్ట్రేలియా సిరీస్‌లో అదరగొట్టిన నితీశ్‌కు మేనేజ్‌మెంట్ అవకాశం ఇచ్చింది. ఈ క్రమంలో భారత క్రికెట్ దిగ్గజం అనిల్ కుంబ్లే కీలక సూచనలు చేశాడు. అతడి విషయంలో వేటు వేయడం, మార్పులు చేయడం చేయొద్దని పేర్కొన్నాడు. "నితీశ్ కుమార్ రెడ్డి బౌలింగ్‌ను చూసి సర్‌ప్రైజ్‌కు గురయ్యా. నిలకడగా సరైన ప్రాంతాల్లో బంతిని సంధించాడు. తొలి వికెట్ లెగ్‌సైడ్ గిఫ్ట్‌గా వచ్చిందనుకున్నా.. రెండోది మాత్రం సూపర్ డెలివరీతోనే రాబట్టాడు. జాక్ క్రాలీకి చక్కటి బంతి సంధించి పెవిలియన్‌కు పంపాడు. జడేజా బౌలింగ్‌లో పోప్ ఇచ్చిన క్యాచ్‌ను ధ్రువ్ జురెల్ చక్కగా ఒడిసిపట్టాడు. జస్‌ప్రీత్ బుమ్రా అద్భుతంగా బౌలింగ్ చేసినా ఎక్కువ వికెట్లు రాలేదు. అతడిని అడ్డుకోవడంపై ఇంగ్లాండ్ బ్యాటర్లు ఎక్కువ దృష్టిపెట్టారు. కానీ, కీలకమైన బ్రూక్‌ను ఔట్ చేశాడు" అని కుంబ్లే వెల్లడించాడు. "నితీశ్ తొలిరోజు 14 ఓవర్లు వేశాడు. ఇంకా వేసేంత ఫిట్‌నెస్ అతడి సొంతం. కుర్రాడు కావడంతో నియంత్రణతో బౌలింగ్ చేశాడు. ఆసీస్ పర్యటనలో సెంచరీ చేసి అందరి దృష్టిలో పడ్డాడు. ఆ సిరీస్‌లో ఎక్కువ వికెట్లు రాకపోయినా భాగస్వామ్యాలను విడదీసేలా బౌలింగ్ చేయగల సమర్థుడని ఇప్పుడు నిరూపించుకున్నాడు. ఫీల్డింగ్‌లోనూ చురుగ్గా ఉండటం తప్పకుండా నితీశ్‌కు కలిసొచ్చే అంశం. అందుకే, అతడి విషయంలో మాత్రం వేటు వేయడం, పక్కన పెట్టడం వంటివి చేయొద్దు. అవకాశాలు ఇస్తూ ఆడించాలి" అని కుంబ్లే వ్యాఖ్యానించాడు.

# ఆసియా కప్ 2025 రద్దు.. కీలక నిర్ణయం దిశగా భారత్, శ్రీలంక..?

**సెప్టెంబర్‌లో జరగాల్సిన ఆసియా కప్ 2025 మరింత ఇబ్బందుల్లో పడింది. ఇప్పుడు టోర్నమెంట్ రద్దు అయ్యే అవకాశం ఉంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి, శ్రీలంక క్రికెట్ కీలక అడుగు వేసి జులై 24న ఢాకాలో జరగనున్న ఆసియా క్రికెట్ కౌన్సిల్ సమావేశానికి హాజరు కాకూడదని నిర్ణయించుకున్నాయి. టెలికాం ఆసియా స్పోర్ట్ నివేదిక ప్రకారం, ఈ ఆరు దేశాల టోర్నమెంట్ ప్రారంభానికి రెండు నెలల కన్నా తక్కువ సమయం మిగిలి ఉన్న సమయంలో రెండు బోర్డులు ఈ నిర్ణయం తీసుకున్నాయి. సమావేశం ప్రణాళిక ప్రకారం జరుగుతుందని ACC ధృవీకరించినప్పటికీ, భారత్, శ్రీలంక లేకపోవడం ఈ టోర్నమెంట్ భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తోంది.**

### సమావేశానికి హాజరు కాకపోవడానికి ? కారణం ఏమిటి?

ఈసారి ఆసియా కప్ టీ20 ఫార్మాట్‌లో జరగనుంది. ఈ టోర్నమెంట్ సెప్టెంబర్ 5 నుంచి ప్రారంభం కావచ్చు, కానీ అంతకు ముందు, జూలై 24న ఢాకాలో జరగనున్న ఏసీసీ సమావేశంలో బీసీసీ, శ్రీలంక క్రికెట్ పాల్గొనకపోవడం వల్ల టోర్నమెంట్ జరగడంపై ప్రశ్నలు తలెత్తాయి. ఏసీసీ సమావేశం ఢాకాలో జరగడంపై బీసీసీఐ అభ్యంతరం వ్యక్తం చేసింది. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు మొహ్సిన్ నఖ్వీ ప్రస్తుతం ఏసీసీ అధ్యక్షుడిగా ఉన్నారు. భారత జట్టు బంగ్లాదేశ్ పర్యటనను నిరవధికంగా వాయిదా వేయాలని బీసీసీఐ ఇటీవల బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)ని ఒప్పించింది. ఈ పర్యటన ఆగస్టులో జరగాల్సి ఉంది. కానీ ఏసీసీ ఢాకాలో తన సమావేశాన్ని నిర్వహించింది, ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో రాజకీయ పరిస్థితి బాగా లేనందున బీసీసీఐ సంతోషంగా లేదు.

### ACC ఏం చెప్పిందంటే?

ఆసియా కప్ నిర్వహణపై బీసీసీఐ మౌనం వహించడం స్పాన్సర్లను, ప్రసారకర్తలను గందరగోళానికి గురి చేసిందని నివేదికలు చెబుతున్నాయి. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) హైబ్రిడ్ మోడల్‌పై అంగీకరించిందని, దీని కింద పాకిస్తాన్ వేరే దేశంలో ఏదైనా అంతర్జాతీయ టోర్నమెంట్‌లో భారత్‌తో మ్యాచ్‌లు ఆడుతుందని నివేదిక పేర్కొంది. భారతదేశం ఇప్పటికీ ఈ టోర్నమెంట్‌ను నిర్వహించాలని యోచిస్తోందా అని తెలుసుకోవడానికి ఏసీసీ అధికారికంగా బీసీసీఐని విచారించింది.

సభ్య దేశాలన్నీ తమ ఏర్పాట్లను ఖరారు చేసుకోవడానికి 15 రోజుల సమయం ఇచ్చామని ఏసీసీ అధికారి ఒకరు తెలిపారు. ఏదైనా సభ్య దేశం స్వయంగా హాజరు కాకూడదనుకుంటే, వారు ఆన్‌లైన్‌లో పాల్గొనవచ్చు. కానీ సమావేశం ఢాకాలో మాత్రమే జరుగుతుంది. అయితే, భారత్, శ్రీలంక దీనిపై ఆసక్తి చూపలేదు. యాదృచ్ఛికంగా బీసీసీఐ, శ్రీలంక క్రికెట్ ఆగస్టులో పరిమిత ఓవర్ల సిరీస్‌ను నిర్వహించాలని యోచిస్తున్నాయి.




### బీసీసీఐ ఏం చెప్పిందంటే?

ఏసీసీ తన అధికారులను ఢాకాకు పంపడానికి బోర్డు నిరాకరించిందని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతానికి రాజకీయ పరిస్థితి బాగా లేనందున ఏసీసీ ఈ ముఖ్యమైన సమావేశాన్ని ఢాకాలో నిర్వహించడం సరైనది కాదు. నివేదిక ప్రకారం, ఆసియా కప్ వాయిదా వేస్తే, బీసీసీసీ మరో సిరీస్ నిర్వహించాలని పరిశీలిస్తోంది. ఆసియా కప్ సెప్టెంబర్ 5 నుంచి %ఖూజు%లో జరిగే అవకాశం ఉంది. ఆ సమయంలో భారతదేశంతో క్రికెట్ ఆడటానికి శ్రీలంక, ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు ఆసక్తి చూపినట్లు వార్తలు వస్తున్నాయి.

### ఆసియా కప్ నుంచి బీసీసీఐ వైదొలగవచ్చు..

బీసీసీఐకి మూడు-నాలుగు బోర్డుల నుంచి ప్రతిపాదనలు వచ్చాయని ఆ అధికారి తెలిపారు. మేం దానిని పరిశీలిస్తున్నాం. భారత జట్టు రెండు-మూడు నెలలు ఖాళీగా కూర్చోవాలని బోర్డు కోరుకోదు. ఆసియా కప్ ఆతిథ్య హక్కులను నిలుపుకోవాలని బీసీసీఐ భావిస్తున్నప్పటికీ, టీ20 ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నమెంట్‌కు సన్నాహాలను ఖరారు చేసే ముందు ప్రభుత్వ ఆమోదం కోసం వేచి ఉంది. ఈ సంవత్సరం పాకిస్తాన్ హాకీ జట్లకు ఆతిథ్యం ఇవ్వడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, అయితే క్రికెట్ వేరే విషయం అని అధికారి తెలిపారు. ఏసీసీ శ్రద్ధ చూపకపోతే, బీసీసీఐ కూడా ఆసియా కప్ నుంచి వైదొలగవచ్చు.

CINIMA NEWS
https://epaper.teluguraastram.com

తెలుగురాష్ట్రం దినపత్రిక



## డార్లింగ్ హెయిర్ స్టైల్‌పై

# నెట్టింట చర్చ!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్టులలో నటిస్తూ యమ బిజీగా గడిపేస్తున్నాడు. మారుతి డైరెక్షన్‌లో ది రాజాసాబ్, హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఫౌజీలలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ రెండు సినిమాల్లో ప్రస్తుతం ది రాజాసాబ్‌షుటింగ్ పూర్తి చేసుకుని రిలీజ్‌కు రెడీ అవుతోంది. తమన్నా పాల్గొనగా ప్రభాస్‌పై ఓ స్పెషల్ సాంగ్‌ని షుట్ చేయబోతున్నారు. ఇదిలా ఉంటే గత కొంత కాలంగా ప్రభాస్ లుక్, హెయిర్ స్టైల్‌పై ఫ్యాన్స్ ఫీలవుతున్న విషయం తెలిసిందే.డార్లింగ్ ప్రభాస్ తన ఒరిజినల్ లుక్‌ని చూపించడం లేదని, రాధేశ్యామ్ టైమ్‌లో ముఖంలో ఓల్డ్ ఛామ్ కనిపించట్లేదని, ప్రభాస్ లుక్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం లేదని ఈ విమర్శలు మరింతగా వినిపించాయి. ఇన్నాళ్లకు తాజాగా ప్రభాస్ తన పర్‌ఫెక్ట్ లుక్‌తో దర్శనమివ్వడంతో ఫ్యాన్స్ ఊపిరి పీల్చుకున్నారు. డార్లింగ్ రియల్ కూల్ లుక్ ఇది కదా అని సంబరాలు చేసుకుంటున్నారు. ఎన్నాళ్ల కెన్నాళ్లకు ఆ అదృష్టం దక్కింది అంటూ మురిసిపోతున్నారు.బాహుబలి రీ యూనియన్ సందర్భంగా కనిపించిన ప్రభాస్ లుక్ చూసిన అభిమానులు మురిసిపోతున్నారు. మళ్లీ డార్లింగ్ ఒరిజినల్ లుక్‌లోకి వచ్చేశాడని హ్యాపీగా ఫీలవుతున్నారు. ప్రభాస్ లుక్‌పై ఫ్యాన్స్ హ్యాపీగా ఉంటే యాంటీ ఫ్యాన్స్ మాత్రం తమ కామెంట్‌లతో కలవరానికి గురి చేస్తున్నారు. ప్రభాస్ హెయిర్ స్టైల్ విగ్ అని, అది ఒరిజినల్ కాదని హేళనగా కామెంట్‌లు పెడుతున్నారు. దీనిపై అంతే ఘాటుగా ప్రభాస్ ఫ్యాన్స్ రిప్లై ఇస్తుండటంతో నెట్టింట ప్రభాస్ లుక్ టాపిక్ హాట్ టాపిక్‌గా మారి వైరల్ అవుతోంది.ఇదిలా ఉంటే ప్రభాస్ ది రాజా సాబ్,ఫౌజీ, స్పిరిట్‌సినిమాల తరువాత తమిళ దర్శకుడుఅమరం ఫేమ్ రాజ్ కుమార్ పెరియసామి డైరెక్షన్‌లో ఓ భారీ సినిమా చేయబోతున్నాడని తెలిసింది. ఇప్పటికే రాజ్‌కుమార్ పెరియసామి స్టోరీలైన్‌ని ప్రభాస్‌కు వినిపించాడని, ఆర్మీ నేపథ్యంలో ఈ కథ సాగుతుందని, లైన్ ప్రభాస్‌కు బాగా నచ్చిందని, వెంటనే తనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడని ఇన్ సైడ్ టాక్.





## ప్రియాంక చోప్రాపై పడ్డ..

# వడా పావ్ ఫ్యాన్స్..!



హైదరాబాద్ వాళ్లకు బిర్యానీ సెంటిమెంట్ కాగా, తమిళ్ వాళ్లకు సాంబార్ ఇడ్లీ సెంటిమెంట్. అలాగే నార్త్ వాళ్లకు ముఖ్యంగా మహారాష్ట్ర వాళ్లకు వడా పావ్ సెంటిమెంట్. ముంబాయి వెళ్లిన వారు ఖచ్చితంగా వడా పావు తినాల్సిందే. వరల్డ్ ఫేమస్ అయిన వడా పావ్‌కు ఎంతో మంది అభిమానులు ఉంటారు. సౌత్ ఇండియాలోనూ వడా పావ్ కొన్ని చోట్ల అమ్ముతారు, కానీ అంతగా ఫేమస్ కాలేదు. ఇండియా మొత్తం వడా పావ్ కి ఉన్న గుర్తింపును గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సెలబ్రిటీలు సైతం వడా పావ్ గురించి ఏదో ఒక సమయంలో మాట్లాడటం మనం చూస్తూ ఉంటాం. చాలా మంది వడా పావ్ తమ ఫేవరేట్ అని చెప్పడం జరిగింది.ఇప్పుడు ఇదే వడా పావ్ కారణంగా గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా చిక్కుల్లో పడింది. ఇటీవల ఒక మీడియా చిట్ చాట్‌లో తన ఫేవరెట్ ఫుడ్ ఐటెమ్స్ గురించి చెప్పుకొచ్చింది. ఆ క్రమంలో రెండు ఫుడ్ ఐటెమ్స్‌ను పెట్టి ఇందులో మీ ఫేవరెట్ ఏది అంటూ ప్రశ్నించిన సమయంలో ఆమె ఒకటి పిక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇండియన్ ఫుడ్ ఐటెమ్స్ తో పాటు ఇంటర్నేషనల్ ఫుడ్ ఐటెమ్స్‌ను సైతం అందులో చేర్చారు. చాలా వాటికి రెండు ఇష్టం, రెండింటిలో ఏది బెస్ట్ అనేది ఎంపిక చేసుకోలేను అని చెప్పింది. కానీ వడా పావ్ విషయంలో మాత్రం అలా చెప్పలేదు. తనకు వడా పావ్ కంటే ఎక్కువగా హాట్ డాగ్ ఇష్టం అని, రెండింటిలో నేను హాట్ డాగ్‌ను ఎంపిక చేసుకుంటాను అంది.వడా పావ్ అంటే చాలా ఇష్టం, ఎక్కువగా తింటాను, కానీ నాకు హాట్ డాగ్ అనేది బలహీనత. అది పక్కన ఉండగా మరేది తినలేను అన్నట్లుగా చెప్పుకొచ్చింది. హాట్ డాగ్ అనేది అమెరికాలో మోస్ట్ పాపులర్ ఫుడ్ ఐటెం. ఈ మధ్య కాలంలో అమెరికాలోనే ప్రియాంక చోప్రా ఎక్కువగా ఉంటుంది, అంతే కాకుండా హాలీవుడ్ సినిమాలు, సిరీస్‌లు చేస్తుంది. అందుకే హాట్ డాగ్‌ను తన ఫేవరేట్ అని చెప్పడం ద్వారా అమెరికన్స్‌కి మరింత దగ్గర కావచ్చు అని ఈమె భావించి ఉంటుందని, అందుకే తన ఫేవరేట్‌గా హాట్ డాగ్‌ను చెప్పిందని చాలా మంది అంటున్నారు. వడా పావ్ కి ఉన్న క్రేజ్ ను తగ్గించే విధంగా ఆమె వ్యాఖ్యలు ఉన్నాయంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రియాంక చోప్రాను వడా పావ్ ఫ్యాన్స్ ఓ రేంజ్‌లో విమర్శలు చేస్తున్నారు. వడా పావ్ ఫ్యాన్స్ మొత్తం ఇప్పుడు ప్రియాంక చోప్రా మీద పడి మరీ ట్రోల్ చేస్తున్నారు. ఈ ట్రోల్స్ నుంచి ఆమె ఎలా బయట పడుతుందో చూడాలి. ఇప్పటికే ఈ విషయమై వివాదం తీవ్రతరం దాల్చుతోంది. ఆమె స్పందించకుంటే, క్షమాపణ చెప్పకుంటే ఆమె నుంచి రాబోతున్న సినిమాలపై ఆ ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వడా పావ్ విషయమై ప్రియాంక చోప్రా వ్యాఖ్యలను పలువురు నార్త్ ఇండియన్ ఆహార ప్రియులు ఖండిస్తున్నారు. కేవలం హాలీవుడ్ ప్రేక్షకుల హృదయాల్లో చోటు సంపాదించుకోవడం కోసం ప్రియాంక చోప్రా ఇలాంటి వ్యాఖ్యలు చేసిందని అంటున్నారు.

# రాజమౌళికి యంగ్ డైరెక్టర్ షాక్?



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, యంగ్ టైగర్ ఎన్టీఆర్ ల తొలి కలయికలో జక్కన్న తెరకెక్కించిన పాన్ ఇండియా వండర్  వరల్డ్ వైడ్‌గా విడుదలైన ఈ మూవీ ఏ స్థాయి సంచలనాలు సృష్టించిందో అందరికి తెలిసిందే. ఇండియాతో దోబూచులాడిన ఆస్కార్‌ని సైతం దక్కించుకుని చరిత్ర సృష్టించింది. ఇండియన్ సినీ హిస్టరీలో ఆస్కార్‌ని సాధించిన సినిమాగా సరికొత్త హిస్టరీని క్రియేట్ చేసి సంచలనం సృష్టించింది. ఇలాంటి మూవీ తరువాత జక్కన్న అత్యంత భారీ స్థాయిలో సూపర్ స్టార్ మహేష్‌తో భారీ పాన్ వరల్డ్ మూవీకి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే.ఇందులో మహేష్‌కు జోడీగా గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా నటిస్తుండగా, మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. మరి కొంత మంది హాలీవుడ్ నటీనటులతో పాటు ఆర్. మాధవన్ కూడా ఇందులో నటించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. పలు హాలీవుడ్ టెక్నీషియన్‌లతో పాటు క్రేజీ వీఎఫ్ ఎక్స్ కంపనీలు పని చేస్తున్న ఈ మూవీ షుటింగ్ జక్కన్న గత చిత్రాలకు భిన్నంగా రాకెట్ స్పీడుతో జరుగుతోంది.ఇప్పటికే పలు కీలక షెడ్యూళ్లని పూర్తి చేసిన జక్కన్న ఈ మూవీని త్వరగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నాడు. సింధూ లోయ, వారణాసికి ఉన్న అనుబంధం నేపథ్యంలో చారిత్రకాంశాల్ని మేళవించి ఓ డివోషనల్ యాక్షన్ అడ్వెంచర్‌గా దీన్ని రాజమౌళి తెరపైకి తీసుకొస్తున్నారు. అయితే ఈ నేపథ్యంలోనే జక్కన్నకు ఓ యంగ్ డైరెక్టర్ షాక్ ఇచ్చినట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. ఈ భారీ పాన్ వరల్డ్ మూవీకి కథ డిమాండ్ మేరకు వారణాసిటైటిల్‌ని రాజమౌళి అనుకున్నారట.అయితే ఆ టైటిల్‌ని ఇప్పటికే ఓ యంగ్ డైరెక్టర్ రిజిస్టర్ చేయించుకోవడమే కాకుండా దాదాపు రూ.40 కోట్ల బడ్జెట్‌తో ఈ మూవీని తెరకెక్కిస్తున్నట్టుగా తెలుస్తోంది. స్టోరీ డిమాండ్ మేరకు యంగ్ డైరెక్టర్ సినిమాకు వారణాసి యాప్ట్ టైటిల్ అట. విషయం తెలుసుకున్న రాజమౌళి ..మహేష్ మూవీ టైటిల్ కోసం సదరు యంగ్ డైరెక్టర్‌ని సంప్రదించి టైటిల్ కావాలని అడిగాడట. అయితే యంగ్ డైరెక్టర్ వారణాసి టైటిల్ ఇవ్వడానికి అంగీకరించలేదని, ఎంత డబ్బు ఆఫర్ చేసినా టైటిల్ ఇచ్చేది లేదని ఖరాకండీగా చెప్పాడని ఇన్ సైడ్ టాక్.ఇంతకీ జక్కన్నకు టైటిల్ విషయంలో షాక్ ఇచ్చిన డైరెక్టర్ ఎవరో కాదు సుబ్బారెడ్డి. ఆది సాయికుమార్‌తో రఫ్‌మూవీని తెరకెక్కించిన సీ.హెచ్. సుబ్బారెడ్డి ప్రస్తుతం ఓ యంగ్ హీరోతో భారీ బడ్జెట్‌తో ఓ సినిమా చేస్తున్నాడు. రూ.40 కోట్లతో తెరకెక్కుతున్న ఈ మూవీకి వారణాసి టైటిల్‌ని ఫిక్స్ చేశారు. ఇదే జక్కన్న కావాలని అడిగి భంగపాటుకు గురి కావడం ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# బన్నీ 26లో నేషనల్ క్రష్ నీలాంబరి!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వంలో ఇండియాస్ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ గా ఓ చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇటీవలే ముంబైలో షుటింగ్ ప్రారంభమైంది. ఇందులో బన్నీకి జోడీగా ముగ్గురు నాయికలు నటిస్తున్నారు. దీపికా పదుకొణే మెయిన్ లీడ్ కాగా, మృణాల్ ఠాకూర్ సెకెండ్ లీడ్ ...థర్డ్ లీడ్ లో జాన్వీ కపూర్ నటిస్తున్నట్లు ప్రచారం లో ఉంది. జాన్వీ పాత్రలో నేషనల్ క్రష్ రష్మిక నటిస్తుందనే ప్రచారం కూడా జరుగుతోంది. వీళ్లిద్దరిలో థర్డ్ లీడ్ ఎవరు? అన్నది ఇంకా కన్ఫమ్ కాలేదు.అయితే తాజాగా ఇదే సినిమాలో రష్మిక విలన్ గా నటిస్తోంది అనే కొత్త ప్రచారం షురూ అయింది. విలన్ పాత్రకు మేల్ కంటే ఫీమేల్ అయితే పర్ఫెక్ట్ గా సూటవుతుందని..ప్రత్యేకించి ఆ పాత్రలో రష్మిక అయితే నూరు శాతం యాప్ట్ అవుతుందనే ప్రచారం మొదలైంది. ఈ నేపథ్యంలో రష్మిక ప్రతి నాయిక? అన్నది సోషల్ మీడియాలో ఊపందుకుంది. రష్మిక కూడా ఇంట్రెస్టింగ్ రోల్ కావడంతో నో చెప్పకుండా ఎస్ చెప్పిందని గట్టిగానే వినిపిస్తుంది.మరి ఈ ప్రచారమంతా నిజమా? కాదా? జాన్వీ కపూర్ ని రీప్లేస్ చేస్తుందా? విలన్ అవుతుందా? అన్నది మేకర్స్ అధికారికంగా ప్రకటిస్తే గానీ క్లారిటీ రాదు. నిజంగా విలన్ పాత్ర పోషిస్తే గనుక ఆ పాత్ర పీక్స్ లో పండే అవకాశం ఉంది. రష్మిక గ్రేట్ పెర్ఫార్మర్. ఎలాంటి పాత్రలోనైనా ఒదిగిపోతుంది. అందమైన హీరోయిన్ గా మెప్పిస్తుంది. అవసరమైతే శివంగిలా మారిపోతుంది. పుష్ప2 లోశ్రీవల్లి పాత్రను ఏ రేంజ్ లో పండించిందో తెలిసిందే.యెగ్రెసివ్ రోల్ లో ఆద్యంతం ఆకట్టుకుటుంది. అటుపై ఛావా చిత్రంలో మహారాజ్ భార్య పాత్రలోనూ ధీరనితగా అలరించింది. ఇలా ప్రతీ చిత్రానికి తనను తాను మరింత మెరుగు పరుచుకుంటుంది. ఇప్పుడు రమ్యకృష్ణలా నీలాంబరిలో అలరించడం విషయంలో రష్మిక తగ్గేదేలే.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339